


# విభారె
## తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్లగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం | స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము | ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి B.A.LL.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 10-08-2022 సంపుటి : 03 సంచిక : 309 పేజీలు : 4 వెల : రూ 3-00


# ఉత్తర కోస్తా జిల్లాలకు భారీ వర్ష సూచన..



అమరావతి/విశాఖపట్నం: కొద్దిరోజులుగా తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. తాజాగా వాయువ్య బంగాళాఖాతానికి ఆనుకుని పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర అల్పపీడనంగా మారి స్థిరంగా కొనసాగుతోంది. దీని వల్ల ఏపీలో పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఇక, రానున్న 48 గంటల్లో ఉత్తర కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. తీరం వెంబడి 45-55 కి.మీల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. ఈ క్రమంలో మత్స్యకారులు సముద్రంలోకి చేపల వేటకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరించారు. ఇదిలా ఉండగా.. భారీ వరదల కారణంగా భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం 43 అడుగులకు చేరుకుంది. దీంతో, అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. కాగా, పెరుగుతున్న వరద ప్రవాహం కారణంగా గోదావరి నీటిమట్టం 55 అడుగులకు చేరే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. దీంతో, గోదావరి పరివాహక ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. ప్రస్తుతం ఎగువ నుంచి గోదావరిలోకి 9,35,465 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. మరోవైపు..

### ఇటు భద్రాచలం వద్ద ప్రమాద హెచ్చరిక జారీ

తూర్పు గోదావరి జిల్లాలోని ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్ద గోదావరిలో నీటి మట్టం 9.8 అడుగులకు చేరుకుంది. 7 లక్షల 26 వేల క్యూసెక్కుల నీరు బ్యారేజ్ నుండి సముద్రంలోకి చేరుతోంది. డెల్టా కాలువలకు 6 వేల క్యూసెక్కుల నీరు సరఫరా అవుతున్నట్టు అధికారులు తెలిపారు.

## ఆ రోజు నా కళ్లల్లో నీళ్లు వచ్చాయి: వెంకయ్యనాయుడు

దిల్లీ: ఎన్ని విభేదాలు, వైరుధ్యాలు ఉన్నా మనమంతా భారతీయులమేనని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ప్రజాస్వామ్యంలో ఓర్పు ఉండాలని..ప్రజాతీర్పును సహించే ఓపిక ఉండాలని చెప్పారు. రాజ్యసభ, స్థానిక జీఎంసీ బాలయోగి ఆడిటోరియంలో సోమవారం తనకు ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో వెంకయ్య మాట్లాడారు."ప్రభుత్వానికి మెజార్టీ ఉన్నా.. ప్రతిపక్షానికి చెప్పే అవకాశం ఇవ్వాలి. నన్ను ఉప రాష్ట్రపతిగా ఎంపిక చేశామని ఐదేళ్ల కిందట ప్రధాని ప్రకటించినప్పుడు నా కళ్లలో నీళ్లు వచ్చాయి. ఈ పదవిని నేను అడగలేదు. పార్టీ అప్పగించిన బాధ్యతలను శిరసావహిస్తూ భాజపాకు రాజీనామా చేశాను. నాకు ఇంతటిస్థాయి ఇచ్చిన పార్టీకి రాజీనామా చేయాల్సి రావడం కన్నీళ్లు తెప్పించింది. ఒకప్పుడు జట్కాలో ఊరంతా తిరుగుతూ.. వాజ్‌పేయిా సమావేశాల గురించి మైక్‌లో ప్రచారం చేసేవాణ్ని. పోస్టర్లు అతికించేవాడిని. అలాంటి నేను భాజపా అధ్యక్షుడినై వాజ్‌పేయిా, అడ్వాణీల మధ్య కూర్చుంటానని కలగనలేదు" అని వెంకయ్య నాయుడు చెప్పారు.



## నిర్మలా సీతారామన్ "తమిళనాడు" వ్యాఖ్యలపై డీఎంకే ఫైర్



చెన్నై : కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో చేసిన "మీ తమిళనాడు" వ్యాఖ్యలపై పాలక డీఎంకే పత్రిక మురసోలి మండిపడింది. లోక్‌సభలో ఆగస్ట్ 1న ధరల మంటపై జరిగిన చర్చకు బదులిస్తూ నిర్మలా సీతారామన్ వ్యాఖ్యలపై డీఎంకే అభ్యంతరం వ్యక్తం చేసింది. బీజేపీ ప్రభుత్వం అదానీ, అంబానీలకు అనుకూలంగా ఉందని కాంగ్రెస్ తరచూ ఆరోపిస్తోందని అయితే మీ తమిళనాట డేటా సెంటర్లను నెలకొల్పేందుకు అదానీతో తమిళనాడు ప్రభుత్వం రూ 35,000 కోట్ల విలువైన ఒప్పందంపై సంతకాలు చేసిందని నిర్మలా సీతారామన్ కాంగ్రెస్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తమిళనాడులో కాంగ్రెస్ పాలక డీఎంకే భాగస్వామ్య పక్షంగా కొనసాగుతోంది. మురసోలి సంపాదకీయం నిర్మలా సీతారామన్ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ మీ తమిళనాడు అనేంత దూరం వెళ్లేలా ఆమె నిగ్రహాన్ని కోల్పోయారని ఆక్షేపించింది.తమిళం మాట్లాడేవారంతా తమిళులు కారని పేర్కొంది. నిర్మలా సీతారామన్ తమిళనాడులో పుట్టిపెరిగి తమిళం బాగా మాటాడగలరు. దేశ ఆర్థిక పరిస్థితులను అర్థం చేసు కునేందుకు ఆర్థిక మంత్రి సంయమనం పాటించాలని సంపాదకీయం హితవు పలికింది. తమిళనాడు వల్ల మీరు ఎందుకు రెచ్చిపోతున్నారు," అని సంపాదకీయం పేర్కొంది, "దేశ ఆర్థిక పరిస్థితుల గురించి" వాస్తవాన్ని గుర్తించడానికి "సంయమనం" కొనసాగించాలని సీతారామన్‌ను కోరింది. నిధులను తర్వాత ఎలాగైనా సమీకరించవచ్చని, ఆమె సంయమనంతో వ్యవహరిస్తేనే బీజేపీ హయాంలో దేశ ఆర్థిక పరిస్థితికి సంబంధించిన వాస్తవాలను అర్థం చేసుకోగలరని పేర్కొంది.నిర్మలా సీతారామన్ ఇలాగే ఉద్రేకంతో వ్యవహరిస్తే ఆమె వాస్తవాలను ఎన్నటికీ అర్థం చేసుకోలేరని తెలిపింది. బియ్యం సహా ప్యాకేజ్డ్ ఆహార పదార్థాలపై 5 శాతం జీఎస్టీ విధించే నిర్ణయాన్ని నిరసిస్తూ తమిళనాడు, కేరళ సహా యూపీ, కర్నాటక వంటి బీజేపీ రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా రైస్ మిల్లర్లు నిరసనలు తెలిపారని పేర్కొంది. జీఎస్టీ వసూళ్లు మెరుగ్గా ఉంటే ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉన్నట్టు ఆర్థిక మంత్రి పేర్కొనడం హాస్యాస్పదమని మురసోలి ఎడిటోరియల్ వ్యాఖ్యానించింది. పన్ను వసూళ్లు, ఆర్థిక ఆరోగ్య పరిస్థితికి సంబంధం లేదని స్పష్టం చేసింది.


# ఏపీలో టీడీపీ వెంటిలేటర్‌పై ఉంది : సజ్జల

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో గడిచిన మూడేళ్లలో జరిగిన ప్రతీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఓడిపోయి ప్రస్తుతం వెంటిలేటర్ పై ఉందని ఏపీ ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి ఆరోపించారు. ఎన్నికల్లో గెలవడానికి అడ్డదారులు ఉండవని అన్నారు. ప్రతి ఎన్నికల్లో ఎవరో ఒకరి తోడులేనిదే టీడీపీ ఎన్నికల్లో పాల్గొనలేదని ఆరోపించారు.వచ్చే ఎన్నికల్లో తామే గెలుస్తామని భ్రమల్లో టీడీపీ ఉందని ఎద్దేవా చేశారు. నిన్న ఢిల్లీలో ప్రధాని మోదీని కలిసిన చంద్రబాబు ఏదోదో ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. చంద్రబాబు ఏపీలో చేసింది, చెప్పుకోదగ్గ కార్యక్రమాలు ఏవీ లేవని అన్నారు. వైసీపీ పార్టీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు స్పష్టంగా ఉన్నాయని,నీతి నిజాయితీగా, పారదర్శకంగా ప్రజలకు అందుతున్నాయని అన్నారు. రాష్ట్రాన్ని పురోభివృద్ధి దిశలో కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు.



# లేటరైట్ అంటూ బాక్సైట్ తరలిస్తున్నారు: చంద్రబాబు మండిపాటు

విజయవాడ: లేటరైట్ తవ్వకాలు అంటూనే బాక్సైట్ తరలిస్తున్నారని టీడీపీ జాతీయాధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివాసీ దినోత్సవం రోజునే ఇలాంటి దోపిడీలు బయటకు రావడం దురదృష్టకరమన్నారు. ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని గిరిజనులకు శుభాకాంక్షలు తెలిపారు. తాము తీసుకొచ్చిన బైక్ అంబులెన్సులను ఈ ప్రభుత్వం అటకెక్కించడంతో ఆదివాసీలు అనేక ఆరోగ్య కష్టాలు ఎదుర్కొంటున్నారని విచారం వ్యక్తం చేశారు. ఆదివాసీల అభివృద్ధి అంటూ గొప్పలకు పోతున్న జగన్ సర్కార్.. గిరిజనుల భూములను ఆక్రమించుకుంటున్నదని దుయ్యబట్టారు.బాక్సైట్ తవ్వకాల కోసం ప్రభుత్వం అక్రమంగా అడవులను నరికేస్తుందని, లేటరైట్‌ను అడ్డుగా పెట్టుకుని బాక్సైట్‌ను తరలిస్తున్నారని ట్విట్టర్ వేదికగా చంద్రబాబు ఆరోపించారు. బాక్సైట్ తవ్వకాలను 2016 లో తాము అధికారంలో ఉన్నప్పుడు రద్దు చేశామని తెలిపారు. గిరిజన గ్రామాల్లో కనీస సౌకర్యాలు కరవయ్యాయని చెప్పారు. గిరిజనుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం 14 చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుని జీఓలు తెచ్చిందని గుర్తుచేశారు. బాక్సైట్ తవ్వకాల కోసమే అడవుల్లో రోడ్లు వేస్తున్నారని, ఇది ఎంత మాత్రమూ అభివృద్ధి కాదన్నారు. ఇన్నేండ్లయినా ఇంకా డోలీల్లోనే రోగులను తరలించడం చూస్తే ఎంత అభివృద్ధి చేశారో అర్థమవుతున్నదని పేర్కొన్నారు.షెడ్యూల్డ్ ప్రాంతంలోని అన్ని ప్రభుత్వ ఉద్యోగాలను జీఓ 3 ప్రకారం స్థానిక గిరిజన అభ్యర్థులతో భర్తీ చేయాలి. ఈ జీవోను ప్రస్తుత వైసీపీ హయాంలో కోర్టు రద్దు చేస్తే.. పునరుద్ధరణ కోసం ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నమూ చేయకపోవడం విచారకరమన్నారు. గిరిజనులకు ఆరోగ్యపరంగా దన్నుగా ఉండేందుకు తాము అధికారంలో ఉన్నప్పుడు బైక్ అంబులెన్సులను తీసుకొచ్చామని చంద్రబాబు తెలిపారు. ప్రస్తుతం అవి కనిపించడం లేదని, గిరిజనులకు సరైన వైద్యం అందించలేకపోతున్నారని విచారం వ్యక్తం చేశారు. అడవుల్లో ఉన్నవారికి ఇప్పటికీ శుద్ధమైన తాగునీరు లభించడం లేదని, ఇంకనూ గెడ్డనీరే తాగుతుండటం జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఇకనైనా ఆదివాసీల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేయాల్సిన అవసరమున్నదని చెప్పారు.గిరిజన సోదరులకు ప్రపంచ ఆదివాసీ దినోత్సవ శుభాకాంక్షలు. తెలుగుదేశం పార్టీ ఆది నుంచీ గిరిజన సంక్షేమం, గిరిజన హక్కుల పరిరక్షణ కోసం కృషిచేసింది. గిరిజన ప్రాంత భూములు, ఉద్యోగాలు, అటవీహక్కులు వంటి వాటికోసం ఆనాడు ఎన్టీఆర్ 14 చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుని జీవోలు కూడా తెచ్చారు.(1/6)



# ఇవాళ ఆదివాసీ దినోత్సవం..

### మరోవైపు గిరిజనుల నిరసన

విజయనగరం: ఒకవైపు దేశమంతా ఆదివాసీ దినోత్సవం జరుపుకుంటుండగా.. మరోవైపు ఆదివాసీలు తమ సమస్యల పరిష్కారం కోసం గళం విప్పేందుకు ఇదే రోజును ఎంచుకున్నారు. ప్రభుత్వం దృష్టిని ఆకర్షించేందుకు నిరసన చేపట్టారు. విజయనగరం జిల్లా శృంగవరపుకోట మండలంలో దారపర్తి, బొడ్డవర, రేగ పుణ్యగిరి తదితర గ్రామాలున్నాయి. ఈ గ్రామాల్లో దాదాపు 4 లక్షల గిరిజన జనాభా ఉన్నది. విద్యాబుద్ధులు అందకపోవడం వల్ల వారు ఇంకా పాతకాలం ఆదివాసీలుగానే మగ్గుతున్నారు.సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడం వల్ల తాము నరకాన్ని ఇక్కడే అనుభవిస్తున్నామని శృంగవరపుకోట మండలం పరిధిలోని గిరిజనులు కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. వైద్యం అందుబాటులో లేకపోవడంతోపాటు, అంబులెన్సులు మూలకు పడటంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని వారు నినదించారు. డోలీ మోతలను నిలువరించేలా ఇక్కడి మంత్రి బొత్స సత్యనారాయణ చర్యలు తీసుకోవాలని వారు కోరారు. శృంగవరపుకోటలో మినీ ఐటీడీఏ ఏర్పాటుచేసి తమ బ్రతుకులను మార్చాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రతి సోమవారం తమ సమస్యల పరిష్కారం కోసం స్పెషల్ గ్రీవెన్స్ డే నిర్వహించాలని వారు సూచించారు.



# సీఎం పదవికి నితీష్ కుమార్ రాజీనామా




పాట్నా : జేడీయూ అధినేత నితీష్ కుమార్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. పాట్నాలోని రాజ్‌భవన్‌లో ఆ రాష్ట్ర గవర్నర్‌ను కలిసి రాజీనామా పత్రాన్ని సమర్పించారు. రాష్ట్రీయ జనతా దళ్(ఆర్జేడీ)తో కలిసి నితీష్ కుమార్ కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉంది. పార్టీ సభ్యులందరి ఏకాభిప్రాయంతోనే రాజీనామా చేసినట్లు నితీష్ కుమార్ ప్రకటించారు.బీజేపీతో నితీష్ కుమార్ తెగదెంపులు చేసుకున్న సంగతి తెలిసిందే. బీహార్‌లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో సీఎంగా ఉన్న నితీశ్ కుమార్.. బీజేపీతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే కొన్నాళ్ల నుంచి బీజేపీతో సంబంధాలు సరిగా లేని కారణంగా.. ఆ కూటమికి ఇవాళ గుడ్‌బై చెప్పేశారు నితీశ్. బీజేపీ(77)-జేడీయూ(45) కూటమి పాలన బీహార్‌లో ముగిసిపోయింది.

# ప్రధాని మోదీ ఆస్తి 2.23 కోట్లు

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ ఆస్తులు విలువ 2.23 కోట్లు. ఎక్కువ శాతం బ్యాంక్ డిపాజిట్ల రూపంలో ఆ మొత్తం ఉంది. అయితే ఆయన పేరు మీద ఎటువంటి స్థిరాస్తి లేదు. గాంధీనగరలో ఉన్న స్థలాన్ని ఆయన డొనేట్ చేశారు. బాండ్, షేర్, మ్యుచువల్ ఫండ్స్‌లో ఆయనకు పెట్టుబడి లేదు. స్వంత వాహనం లేదు. మోదీకి నాలుగు బంగారు ఉంగరాలు ఉన్నాయి. వాటి విలువ 1.73 లక్షలు. మార్చి 31వ తేదీన ఇచ్చిన డిక్లరేషన్ ఆధారంగా ఈ వివరాలు తెలిశాయి. ఏడాది కాలంలో మోదీ ఆస్తులు 26.13 లక్షలు పెరిగినట్లు తెలుస్తోంది. గుజరాత్ సీఎంగా ఉన్న సమయంలో ఓ రెసిడెన్షియల్ ప్లాట్‌ను ముగ్గురితో కలిసి కొన్నారు. అయితే ఆ ఫ్లాట్‌ను దానం చేసినట్లు తెలుస్తోంది .రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చరాస్థి 2.54 కోట్లు కాగా, స్థిరాస్థి 2.97 కోట్లు అని డిక్లరేషన్ ద్వారా తేలింది. 29 మంది క్యాబినెట్ మంత్రుల్లో .. ధర్మేంద్ర ప్రధాన్, జ్యోతిరాధిత్య సింథియా, ఆర్కే సింగ్, హర్‌దీప్ సింగ్ పురి, పురుషోత్తం రూపాలా, జీ కిషన్ రెడ్డిలు తమ ఆస్తుల వివరాలను వెల్లడించారు.



## ఆదివాసీల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి: లోకేష్


అన్నపూర్ణ మ్యారేజెస్ వరల్డ్ వైడ్‌గా తెలుగు వారు ఎక్కడున్నా అన్ని కులముల వారికి పెళ్లి సంబంధములు కుదర్చడంలో టాప్ పొజిషన్సం॥ 93979 79750


అమరావతి: అడవి తల్లిని ప్రాణం కంటే ఎక్కువగా ప్రేమించే ఆదివాసీలకు టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్ ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. పోలవరం ప్యాకేజి దగ్గర నుండి ఎన్నో ఏళ్లుగా గిరిజనానికి హక్కుగా వస్తున్న అనేక సంక్షేమ కార్యక్రమాలు రద్దు చేయడం వరకూ జగన్ రెడ్డి వారిని నమ్మించి వంచించారని మండిపడ్డారు. మాటలతో కోటలు కట్టడం మాని వైసీపీ ప్రభుత్వం ( చిత్తశుద్ధిగా ఆదివాసీల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని లోకేష్ అన్నారు.



# సంపాదకీయం

బుధవారం 10-08-2022

## బీహార్ లో బీజేపీ మార్క్ పాలిట్రిక్స్

బీహార్ రాజకీయాలు శరవేగంగా మారుతున్నాయి. జేడీయూ–బీజేపీ సర్కార్‌లో సంక్షోభం గంట గంటకు ముదురుతోంది. తాజా పరిణామాలతో ఎన్డీఏ నుంచి బయటకు వచ్చేందుకు మిత్రపక్షం జేడీయూ ప్రయత్నం ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. మిత్రపక్షం బీజేపీతో సీఎం నితీశ్ కుమార్ చాలా కాలంగా అంటీముంటనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో ప్రధాని మోదీ నేతృత్వంలో ఆదివారం జరిగిన నీతి ఆయోగ్ సమావేశానికి గైర్హాజరు కావడంతో మోడీకి నితీశ్ కుమార్‌కు మధ్య క్లాష్ క్లియర్‌గా కనిపిస్తోందనే వాదన తెరపైకి వస్తోంది. జులై 17 తర్వాత కేంద్రం నిర్వహించిన నాలుగు సమావేశాలకు నితీశ్ కుమార్ డుమ్మా కొట్టడంతో బీజేపీ, జనతాదళ్ మైత్రి బంధానికి బ్రేక్స్ పడనుందనే చర్చ జోరందుకుంది. జేడీయూ మాజీ జాతీయ అధ్యక్షుడు ఆర్‌సీపీ సింగ్ పార్టీకి శనివారం రాజీనామా చేశారు. ఆర్సీపీ సింగ్‌పై నితీశ్ చాలా కాలంగా అసంతృప్తితో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆర్సీపీ సింగ్ బీజేపీతో సన్నిహితంగా ఉండటంతో పాటు తన అనుమతి లేకుండా ఆర్సీపీ సింగ్‌ను మోదీ తన కేబినెట్లోకి తీసుకోవడం నితీశ్ కుమార్‌కు ఆగ్రహం తెప్పించిందట. ఈ క్రమంలోఆర్సీపీ సింగ్ కుమార్తెల అక్రమాస్తులకు సంబంధించి సీఎం నితీశ్ కుమార్ వివరణ కోరడం, ఆ వెంటనే ఆయన పార్టీకి రాజీనామా చేయడం బీహార్ రాజకీయంలో దుమారానికి తక్షణ కారణంగా మారింది.బీహార్‌లో ప్రస్తుతం జేడీయూ, బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం కొనసాగుతోంది. తాజా పరిణామాలతో ఆగస్టు 11కు ముందే జేడీయూ–బీజేపీ సర్కార్ కూలిపోతుందని ప్రచారం జరుగుతోంది. దీంతో నితీశ్ కుమార్ అలర్ట్ అయ్యారు. అధికారాన్ని హస్తగతం చేసుకోకుండా ఉండేందుకు తన ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా బీజేపీకు చెక్ పెట్టేందుకు నితీశ్ కుమార్ అనేక ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నట్లు తెలుస్తోంది. జేడీయూ–బీజేపీ సంకీర్ణ కూలిపోతే నితీశ్ మళ్లీ ఆర్‌జేడీతో జట్టుకట్టాలని భావిస్తున్నట్లు బీహార్ రాజకీయాల్లో ప్రచారం జరుగుతోంది. మరో వైపు కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీని కలిసేందుకు నితీశ్ కుమార్ అపాయింట్ మెంట్ కోరినట్లు ప్రచారం జరుగుతోంది. మోడీకి చెక్ పెట్టేలా ప్రభుత్వంలో భాగమైన బీజేపీతో విడిపోయి మధ్యంతర ఎన్నికలకు వెళ్లాలని నితీశ్ మరో ఆలోచనలో ఉన్నారని అయితే మధ్యంతర ఎన్నికలకు జేడీయూ ఎమ్మెల్యేలు సుముఖంగా లేకపోవడంతో ఆర్జేడీ, కాంగ్రెస్ తో పాటు వామపక్షాలను కలుపుకొని బీహార్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసే దిశగా సీఎం ఆయా పార్టీలతో సంప్రదింపులు కొనసాగిస్తున్నారనే టాక్ వినిపిస్తోంది.కొంత కాలంగా మిత్ర పక్షం బీజేపీలో క్రమక్రమంగా నితీశ్ కుమార్ దూరం పెంచుకుంటూ వస్తున్నారు. అయితే ఇప్పుడు జేడీయూ– బీజేపీ సర్కార్ ఏ క్షణమైనా కూలేందుకు సిద్ధంగా ఉండటంతో నితీష్ కుమార్ సరికత్త ఎత్తుగడలు వేస్తున్నారు. మహారాష్ట్రలో ఏక్ నాథ్ షిండే రూపంలో ఉద్ధవ్ ఠాక్రే ప్రభుత్వంపై తిరుగుబాటు జరిగినట్లుగా బీహార్‌లోనూ బీజేపీ గేమ్ స్టార్ట్ చేసే అవకాశాలు ఉన్నాయని పసిగట్టినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా హుటాహుటీనా పార్టీ ఎమ్మెల్యేలతో భేటీ కావడం, ఇతర పార్టీలతో సంప్రదింపులు జరపడం వెనుక బీజేపీ ఎత్తుగడలకు చిక్కకుండా తన ప్రభుత్వాన్ని కాపాడుకోవడంలో భాగంగా తెలుస్తోంది. ప్పటికే బీహార్‌లో జేడీయూ–బీజేపీ పొత్తు తెగిపోతోందని ప్రచారం నడుస్తోంది. చాలా మంది జేడీయూ ఎమ్మెల్యేలు మధ్యంతర ఎన్నికలకు విముఖత చూపుతున్నందున, రాష్ట్రంలో అధికారాన్ని నిలుపుకోవడానికి ఆ పార్టీ.. ఆర్జేడీ, కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలతో పొత్తు పెట్టుకోవాలని చూస్తోందని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.బీహార్‌లో ఇలాంటి రాజకీయ గందరగోళం మధ్య నితీశ్ కుమార్ మంగళవారం పాట్నాలో కీలక సమావేశం ఏర్పాటు చేశారు. పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలందరినీ ఈ సమావేశానికి పిలిచినట్లు తెలుస్తోంది. ఈ భేటీ తర్వాత ఎన్డీఏ నుంచి వైదొలిగే అంశంపై బీహార్ సీఎం కీలక ప్రకటన చేస్తారని అంతా ఆశిస్తున్నారు. మరోవైపు బీజేపీతో విభేదాల వార్తలను జేడీయూ జాతీయ అధ్యక్షుడు లాలన్ సింగ్ ఖండించారు. మిత్రపక్షమైన బీజేపీతో అంతా బాగానే ఉందని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం జరిగే కీలక సమావేశానికి ఆర్జేడీ ఎంపీలు, ఎమ్మెల్యేలు పాట్నాకు తరలిరావాలని కోరారు. కాగా, ఎన్డీయేకు మరో మిత్రపక్షమైన బీహార్ మాజీ సీఎం జితన్ రామ్ మాంఝీ నేతృత్వంలోని హిందుస్థానీ అవామ్ మోర్చా కూడా తమ ఎమ్మెల్యేలందరితో సమావేశాన్ని ఏర్పాటు చేసింది. బీజేపీని గెంటేసి.. ఆర్జేడీతో కలిసి నితీష్ కుమార్ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇవన్నీ చర్చల దశకు వచ్చాయి. దాదాపుగా పూర్తయ్యాయి. మంగళవారం అధికారికంగా ప్రకటన చేసే అవకాశం కనిపిస్తోంది. గత ఎన్నికల్లో నితీష్ కుమార్ పార్టీ దారుణంగా దెబ్బతిన్నది. అయినప్పటికీ బీజేపీ ఆయనకు ముఖ్య మంత్రి పదవి ఇచ్చింది. కానీ మెజార్టీ స్థానాలు బీజేపీ దగ్గర ఉన్నాయి.దీంతో ఆయన చేయడానికి ఏమీ లేకుండా పోతోంది. దీంతో ఆర్జేడీని ప్రభుత్వంలోకీ తీసుకుని.. బీజేపీని పంపేయాలని అనుకుంటున్నారు. ఆర్జేడీకి ప్రభుత్వ ఏర్పాటుకు చాలాకొద్ది స్థానాలే తగ్గాయి. కాంగ్రెస్ కూడా ఈ మార్పు పట్ల సానుకూలంగా ఉంది.గతంలో నితీష్ తమను డంప్ చేసి వెళ్లిపోయినా ఇప్పుడు తప్పు దిద్దుకునేందుకు ప్రభుత్వ ఏర్పాటుకు కలసి వస్తున్నందున వారుకూడా ఓకే అంటున్నారు. ఈ కారణంగా ఇప్పుడు బీజేపీ కీలక రాష్ట్రంలో అధికారం కోల్పోతోంది. ఎన్డీఏలో ఉన్న ఓ మాదిరి పార్టీ జేడీయూనే. ఇప్పుడు ఆ పార్టీ కూడా గుడ్ బై చెబుతోంది. ఇప్పటికే జేడీయూ బీజేపీతో అన్ని సంబంధాలు తెంచుకుంది. నీతి ఆయోగ్ భేటీకి కూడా నితీష్ వెళ్లలేదు. ప్రభుత్వ మార్పుపై బీహార్‌లో కీలక పరిణామాలు చోటు చేసుకునే అవకాశం కనిపిస్తోంది.

# హాట్ టాపిక్ గా రాజకీయ వ్యవహారాలు

విజయవాడ, ఆగస్టు 9,ఎన్నికలిప్పుడపుడే లేవు. కానీ ఏపీలో రాజకీయ పొత్తుల వ్యవహారం హాట్ టాపిక్‌గా మారుతోంది. ఇందుకు ఆగస్ట్ 6,7 తేదీలలో న్యూఢిల్లీ వేదికగా చోటుచేసుకున్న రెండు పరిణామాలు కారణమయ్యాయి. ఈ పరిణామాలే ఏపీ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశాలుగా మారాయి. రాజకీయాలు ఎప్పుడూ ఒకేలా ఉండవు.. ఇప్పుడు ఏపీలో రాజకీయం ఏ రంగు మార్చుకుంటుందా అనే చర్చ హాట్‌హాట్‌గా సాగుతోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, టీడీపీ అధినేత చంద్రబాబు ఆప్యాయంగా మాట్లాడుకోవడమే పొలిటిక్ హీట్ పుట్టించింది. ఆజాదీకా అమృత్ మహోత్సవ్సన్నాహక సమావేశంలో ఇది ఆగస్టు అయిదో తేదీన జరిగింది. గత నాలుగైదేళ్ళుగా రాజకీయ ప్రత్యర్థులుగా వున్న మోదీ, చంద్రబాబు పరస్పరం పలకరించుకున్నారు. మళ్ళీ కలుద్దామంటే ఓకే ఓకే అనేసుకున్నారు. ఇది జరిగిన మర్నాడే అదే నరేంద్ర మోదీ.. ఏపీ సీఎం జగన్‌కు పెద్దపీట వేస్తూ కలిసి భోం చేశారు. దాంతో మోదీ వ్యూహమేంటన్నది ఆసక్తికరంగా మారింది. అటు చంద్రబాబుని ఆప్యాయంగా పలకరించి.. “ మీతో చాలా మాట్లాడాలి.. మళ్ళీ కలుద్దాం ” అన్న నరేంద్ర మోదీ.. ఆ మర్నాడే సీఎం జగన్‌తో కలిసి భోం చేయడం.. బీజేపీయేతర సీఎంలలో జగన్‌కే ప్రాధాన్యతనివ్వడం పలు సందేహాలకు, మరిన్ని ఊహాగానాలకు తెరలేపింది. 2014 సార్వత్రిక ఎన్నికల వేళ చంద్రబాబు, నరేంద్ర మోదీ కలిసి పయనించారు. తిరుపతి సభలో వేదికను పంచుకున్నారు. ఆ తర్వాత మూడేళ్ళ పాటు బీజేపీ, టీడీపీ కలిసే వున్నాయి. రాష్ట్ర విభజన తర్వాత మిగిలిన పదమూడు జిల్లాల ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటైన తొలి ప్రభుత్వంలో బీజేపీ భాగస్వామ్యం తీసుకుంది. రెండు మంత్రి పదవులను దక్కించుకుంది. ప్రత్యేక హోదా ఇవ్వని బీజేపీతో అంటకాగితే 2019 ఎన్నికల్లో బొక్క బోర్లా పడతానేమో అన్న అనుమానంతో బీజేపీకి దూరం కావాలని బాబు భావించారు. ఆ తర్వాతే ఏపీలో రాజకీయం రంగు మారింది. బీజేపీని పక్కన పెట్టేసిన చంద్రబాబు.. 2019 ఎన్నికలు దగ్గరవుతున్న కొద్దీ బీజేపీపైనా, మరీ ముఖ్యంగా మోదీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఇంకో అడుగు ముందుకేసి చిరకాల ప్రత్యర్థి పార్టీ కాంగ్రెస్ పార్టీతో జతకట్టారు. ఆనాటి ప్రయోగం బెడిసి కొట్టి దారుణంగా పరాజయంపాలైన చంద్రబాబు 2019 అనంతరం బీజేపీకి దగ్గరయ్యేందుకు, మోదీని కలిసేందుకు విఫలయత్నాలు చేశారన్న ప్రచారమూ వుంది. ఈక్రమంలో ఆగస్టు 5వ తేదీన ఆజాదీకా అమృత మహోత్సవ్ భేటీకి రావాల్సిందిగా చంద్రబాబుకు ఆహ్వానం రావడం.. ఆయన వెళ్ళడంతో మోదీ ఆప్యాయంగా పలకరించి.. పక్కకు తీసుకువెళ్ళి మరీ మాట్లాడడం రాజకీయ విశ్లేషకులను సైతం ఆశ్చర్యపరిచింది. అయితే ఈ సైడు మీటింగ్‌పై సహజంగానే టీడీపీ వర్గాలు మీడియాకు తమదైన శైలిలో లీకులిచ్చి.. రాజకీయాన్ని రంజుగా మార్చాయి. ఇక వైఎస్ జగన్ విషయంలో పరిస్థితి అందుకు భిన్నం. 2014 నుంచి 2017 దాకా టీడీపీతో పొత్తు వున్నప్పటికీ.. జగన్ విషయంలో నరేంద్ర మోదీ ఏనాడు దూరం పెట్టింది లేదు.. అలాగని అక్కున చేర్చుకున్నది లేదు. అయితే, 2019లో జగన్ సీఎం అయ్యాక మాత్రం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో సన్నిహితంగానే మెలుగుతున్నారు. రాష్ట్ర ప్రయోజనాల పేరిట పలు అంశాల్లో ఎన్డీయే ప్రభుత్వం తీసుకువచ్చే బిల్లులకు మద్దతిస్తూనే వున్నారు. విపక్షంలో వున్నప్పుడు 2017లోను, తాజాగా అధికారంలో వున్నపుడు 2022లోను రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థులకే వైసీపీ మద్దతిచ్చింది. ఏపీలో బీజేపీ ఎదిగేందుకు యత్నిస్తున్న తరుణంలోను టీడీపీ, జనసేన వంటి విపక్షాలపై వైసీపీ విరుచుకుపడుతున్నా.. బీజేపీ విషయంలో అంతగా హార్డ్‌కోర్ అటాక్ ఏమీ చేయడం లేదు. ఢిల్లీకి వెళ్ళిన ప్రతీసారి వీలైతే ప్రధాని మోదీని, లేకపోతే హోం మంత్రి అమిత్ షాని కలిసి వస్తున్నారు ఏపీ ముఖ్యమంత్రి జగన్. ఇదంతా ఒకెత్తయితే.. ఆగస్టు 7వ తేదీన ఢిల్లీలో జరిగిన నీతి ఆయోగ్ మీటింగ్‌లో జగన్‌కు మోదీ ప్రాధాన్యతనివ్వడం చర్చనీయాంశమైంది. బీజేపీయేతర ముఖ్యమంత్రుల్లో ఇద్దరికే మోదీ ప్రాధాన్యతనిచ్చారు. వీరిలో ఒకరు రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాట్ కాగా.. మరికొరు ఏపీ సీఎం వైఎస్ జగన్. మోదీ కోసం ఏర్పాటు చేసిన లంచ్ టేబుల్‌పైనే జగన్‌కు చోటివ్వడం.. ఆ తర్వాత కూడా ఇద్దరు ప్రత్యేకంగా మాట్లాడుకోవడం ఆసక్తి రేకెత్తించాయి.2019 ఎన్నికలకు ముందు.. 2017లో ప్రత్యేక హోదా విషయంలో బీజేపీకి, టీడీపీకి వ్యవహారం చెడిన తర్వాత మోదీ, చంద్రబాబు ఎదురుపడింది లేదు. మాట్లాడుకుందీ లేదు. అలాంటి దృశ్యం కనిపించనే లేదు. అక్షరాలా ఐదేళ్ల తర్వాత నరేంద్ర మోదీ, చంద్రబాబు ఒకేచోట కనిపించారు. ఒకేచోట కనిపించడం మాత్రమే కాదు.. మిగతా వాళ్లందరూ ఓ వైపు ఉంటే మోదీ, చంద్రబాబు మరోవైపునకు వెళ్లి ముచ్చటించడం అందరి చూపునూ వాళ్లవైపు తిప్పుకునేలా చేసింది. రాష్ట్రపతి భవన్‌లో ఆజాదీ కా అమృత మహోత్సవ్ కార్యక్రమానికి సంబంధించిన మీటింగ్ జరిగింది. ఈ సభకు చంద్రబాబుకు కేంద్రం ఆహ్వానం పంపింది. అక్కడే పలువురు కేంద్రమంత్రులు, ఇతర రాష్ట్రాల సీఎంలతోనూ మాట్లాడారు మోదీ. ఇదంతా వార్తల్లో పెద్ద అంశం కాకపోయినా.. ఆ తర్వాత మోదీ, చంద్రబాబు నవ్వుకుంటూ ఓ పక్కకు వెళ్లి ముఖాముఖీ మాట్లాడుకోవడం మాత్రం హైలైట్ ఆఫ్ ది డేగా మారింది. చంద్రబాబునాయుడు కొన్ని నిమిషాల సమయం కావాలని ప్రధాని మోదీని కోరారు. ఆ తర్వాత ఇద్దరూ పక్కపక్కనే నిలబడి ఐదు నిమిషాల పాటు మాట్లాడుకున్నారు. ముఖ్యంగా నరేంద్ర మోదీ చంద్రబాబుతో పలకరింపుపై ఏపీ రాజకీయాల్లో హాట్ హాట్ గా చర్చ జరుగుతుంది. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బీజేపీ, జనసేనలతో రాజకీయ పొత్తును పునరుద్ధరించుకునేందుకు నాయుడు ప్రయత్నిస్తున్నట్లు కథనాలు తీవ్రమయ్యాయి. మూడు పార్టీల పొత్తు ప్రాధాన్యతను జనసేన వ్యవస్థాపకుడు పవన్ కళ్యాణ్ ఇప్పటికే పలు సందర్భాలలో ఉటంకించారు. అయితే బీజేపీ రాష్ట్ర నేతల నుంచి ఎలాంటి గ్రీన్ సిగ్నల్ రాలేదు. ఏపీలోని రాజకీయ పరిస్థితులను, జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని మోదీకి చంద్రబాబునాయుడు వివరించే అవకాశాలున్నాయి. చంద్రబాబు ప్రధాని మోదీని కలవడం పట్ల పార్టీ నేతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రానున్న రోజుల్లో టీడీపీ–బీజేపీ మధ్య రాజకీయ సంబంధాలు పునరుద్ధరిస్తాయని, రెండు పార్టీలకు మేలు జరుగుతుందని వారు భావిస్తున్నారు. మొత్తం మీద ఢీల్లీలో చంద్రబాబు మరోసారి హైలైట్ అయ్యారు. జనసేనాని ప్రతిపాదిస్తున్నట్లు ఏపీలో ప్రభుత్వ ఓటు చీలకుండా వుండేందుకు బీజేపీ, జనసేన, టీడీపీలు కలుస్తాయా అన్నదిపుడు ఆసక్తి రేపుతోంది. అయితే ఏపీలో ఎన్నికల కంటే ముందుగానే తెలంగాణలో ఎన్నికలు రానున్నాయి. ఊహాగానాలు నిజమైతే 2023 తొలి భాగంలోను, తెలంగాణ మంత్రి కే.టీ.రామారావు చెప్పినదే నిజమైతే 2023 రెండో భాగంలోను తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి. అయితే ఖమ్మం,నల్గొండ, రంగారెడ్డి జిల్లాల్లో ఇప్పటికీ ఎంతో కొంత టీడీపీ శ్రేణులు, ఓటు బ్యాంకు వున్నాయి. అదేసమయంలో ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి నల్గొండ జిల్లాల్లో బీజేపీకి అభ్యర్థులే లేరన్న అభిప్రాయం వుంది. ఈ తరుణంలో చంద్రబాబుతో బీజేపీ జతకడితే తెలంగాణలో ప్రయోజనం కలిగే అవకాశం వుందని, టీఆర్ఎస్ పార్టీలో చేరిన టీడీపీ వర్గాలు టీడీపీ–బీజేపీ కూటమి వైపు మొగ్గుచూపే అవకాశాలున్నాయిని ఓ విశ్లేషణ ప్రాచుర్యంలో వుంది. ఈ లాజిక్ ప్రకారం ముందుగా తెలంగాణలో బీజేపీకి ఉపయోగపడడం ద్వారా ఆ తర్వాత జరిగే ఏపీ ఎన్నికల్లో పరస్పరం ప్రయోజనం పొందాలన్నది చంద్రబాబు వ్యూహంగా చెప్పుకుంటున్నారు.బీజేపీతో తెలుగుదేశం పార్టీ సుదీర్ఘకాలంగా సాగిస్తున్న పొత్తు ప్రయత్నాలను మోదీ, బాబు తదుపరి భేటీ ఓ కొలిక్కి తీసుకుని రావొచ్చనే ప్రచారం ఊపందుకుంది. మోదీ, చంద్రబాబు ఇద్దరు కీలక నేతల పరస్పర పలకరింపు.. టీడీపీ, బీజేపీ మళ్లీ ఒక్కటవ్వబోతున్నాయా? అనే కొత్త చర్చ తెరమీదకొచ్చింది. చంద్రబాబును మళ్లీ చంకనెత్తుకునేందుకు కమలం పెద్దలు సిద్ధమయ్యారా? అనే గుసగుసలు మొదలయ్యాయి. ఏపీలో పొలిటికల్ పార్టీల మూడ్ మారుతోందనే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఇవన్నీ చూశాక, టీడీపీ వైపు బీజేపీ అడుగులు వేస్తోందా?. అనే చర్చ జరగకుండా ఎలా ఉంటుంది. వచ్చే ఎన్నికల్లో కలిసి పనిచేసేందుకు కూడా రెండు పార్టీలు సిద్ధమవుతున్నాయి. తమ మిత్ర పక్షమైన జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కి ఆహ్వానం పంపకుండా చంద్రబాబుకు పంపడంలో ఆంతర్యమేంటనే ప్రశ్న ఇపుడు పలువురిలో వ్యక్తమవుతోంది. ఈ లెక్కన టీడీపీని మళ్లీ దగ్గర చేసుకునేందుకు బీజేపీ ప్రయత్నాలు మొదలెట్టిందహో అంటూ? పొలిటికల్ కారిడార్ దండోరా కొట్టేస్తున్నారు కొందరు. మరో వైపు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బీజేపీతో కూడా సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నారు. బీజేపీపై జగన్ ఇప్పటివరకూ తీవ్రస్థాయిలో విమర్శలు చేసింది లేదు. మోదీ సైతం.. జగన్‌ను కలిసిన ప్రతీసారి ఎంతో ప్రాధాన్యతను ఇచ్చారు. ఇటీవల అల్లూరి విగ్రహావిష్కరణ మీటింగ్‌లోనూ, జగన్‌కు మోదీ ఇచ్చిన ప్రియారిటీ మామూలుదేమీ కాదు. అందుకే, వైసీపీ, బీజేపీ మధ్య లోపాయకారి ఒప్పందమేదో కుదిరిందని.. రాజకీయ వర్గాల్లో చాన్నాళ్లుగా వినిపిస్తూనే ఉంది. అయితే, ఆ అనుబంధాన్ని కాస్తా.. అఫీషియల్ చేసేసుకుందామని కాషాయ దళం భావిస్తోందా? అనే అనుమానాలు ఇప్పుడు తీవ్రరూపం దాల్చాయి. మోదీ ఇపుడు చంద్రబాబును దగ్గర చేసుకుంటారా ? లేక జగన్‌తో అవగాహనకే ప్రాధాన్యతనిస్తారా ? అన్న సందేహాలు పలువురిలో వినిపిస్తున్నాయి. ఇంకా చెప్పాలంటే మోదీ ఇపుడు ఏ గెట్టునుంటారు ? అన్న చర్చ గల్లీ గల్లీలో జరుగుతోంది. మోదీ వ్యూహం ఏంటన్నది హాట్ టాపిక్‌గా మారింది. అయితే, ఈ అంశం ఇప్పటికిప్పుడు తేలేలా లేదు. ఎందుకంటే అటు పవన్ కల్యాణ్‌తోగానీ, ఇటు చంద్రబాబుతోగానీ డైరెక్టు అవగాహనకు తెలంగాణ బీజేపీ నేతలు సిద్ధంగా లేరు. బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల కలయిక నిక్కచ్చిగా సానుకూల ఫలితం ఇస్తుందన్న క్లారిటీ బీజేపీ అధిష్టానానికి కలిగితే మాత్రం తెలంగాణ బీజేపీ నేతలను ఒప్పించడం పెద్ద కష్టమేమీ కాదు.

# ఢిల్లీ ద్వారాలు తెరిచే ఉన్నాయి...

విజయవాడ, ఆగస్టు 9,తెలుగుదేశం పార్టీ అధినే చంద్రబాబు లక్ష్యం నెరవేరింది. చాలా రోజుల తర్వాత ఆయన జరిపిన ఢిల్లీ పర్యటన సక్సెస్ అయిందనే చెప్పాలి. ఆయన ఆజాదీకా అమృతోత్సవ్ కమిటీ సమావేశంలో పాల్గొనేందుకు వెళ్లినా అసలు కార్యం వేరే ఉంది. ప్రధానంగా బీజేపీతో సాన్నిహిత్యం పెంచుకోవాలన్నది ఆయన పర్యటన ముఖ్య ఉద్దేశ్యం. ప్రధాని మోదీ, అమిత్ షాల కోసం ప్రత్యేకంగా ఢిల్లీ వెళితే అపాయింట్‌మెంట్ దొరకొచ్చు. దొరకకపోవచ్చు. కానీ వారి ఆహ్వానం పంపిన సమావేశానికి హాజరయితే కొంత సానుకూలతను పొందే వీలుంటుంది.వీలయితే రెండు మాటలు.. అన్నట్లు ఛాన్స్ దొరికినా చాలు. అది దొరికింది. చంద్రబాబుతో మోడీ మాట్లాడారు. ఐదు నిమిషాలు కావచ్చు. ఒక నిమిషం కావచ్చు. అది చాలు బాబుకు. చంద్రబాబుకు ఆ మాత్రం అవకాశం లభిస్తే చాలు. రాజకీయాల్లో ఉత్థానపతనాలను చూసిన ఆయన అవకాశాన్ని జారవిడ్చుకోరు. ఆ సమావేశంలో మోదీ చంద్రబాబు వద్దకు వచ్చి మరీ పలకరించారు. అది చాలు ఆయన అనుకూల పత్రికలు తరచూ ఢిల్లీ రావాలని మోదీ కోరారని వార్తలు ప్రచురించాయి. అందులో నిజానిజాలు పక్కన పెడితే ఇంకోసారి ఢిల్లీ వెళితే సులువుగా చంద్రబాబుకు మోదీ అపాయింట్‌మెంట్ లభించే అవకాశాలు మాత్రం పుష్కలంగా కనిపిస్తున్నాయి. త్వరలోనే మళ్లీ.... ఆయన త్వరలోనే మళ్లీ ఢిల్లీ పర్యటన చేసే అవకాశాలను కొట్టి పారేయలేం. ఎందుకంటే మోదీ, అమిత్ షాల అపాయింట్‌మెంట్ దొరికితే జగన్ ను ఇరుకున పెట్టొచ్చు. మైండ్ గేమ్ స్టార్ట్ చేసే వీలుంది. జగన్ తన ట్రాప్ లో పడి తాను చేసినట్లే మోదీకి జగన్ దూరమయ్యే అవకాశాల కోసం ఆయన చాలా రోజుల నుంచి ఎదురు చూస్తున్నారు. కానీ ఇంత వరకూ సాధ్యం కాలేదు. ఇప్పుడిప్పుడే ఢిల్లీలో ద్వారాలు తెరుచుకుంటున్నాయి. ఆ సంకేతాలు అందుతున్నాయి. పవన్ కల్యాణ్, బీజేపీ, టీడీపీ కలిస్తే రాష్ట్రంలో అధికారంలోకి వచ్చే వీలుంది. ఇటు రాష్ట్రంలోనూ బీజేపీ కష్టాల్లో ఉంది. సొంతంగా పార్లమెంటు స్థానాలను గెలుచుకునే పరిస్థితి లేదు. పవన్ కల్యాణ్ ను నమ్ముకుని ఎన్నికల గోదాలోకి దిగితే పుట్టిమునిగినట్లే. తమకంటూ కొన్ని స్థానాలు బీజేపీకి కావాలి. జగన్ బీజేపీతో నేరుగా కలిసే అవకాశం లేదు. బయటనుంచి మద్దతు ఇవ్వవచ్చేమో కాని, పొత్తుకు ముందుకు రారు. ఈ ఈక్వేషన్లు తనకు కలసి వస్తాయని చంద్రబాబుకు తెలుసు. అలాగే తనకూ బీజేపీ అవసరం చాలా ఉంది. అందుకే బీజేపీ కేంద్రం పెద్దలు కూడా తనతో మరోసారి పొత్తుకు సిద్ధపడతారని ఆయన వేసిన అంచనా నిజ రూపం దాల్చే వీలుంది. మొత్తం మీద చంద్రబాబు ఢిల్లీ పర్యటన ఆయన ఊహించిన దానికంటే ఎక్కువగానే విజయవంతం అయిందనే టీడీపీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# ముంచేసిన టమాట



అనంతపురం, ఆగస్టు 9, ప్రస్తుతం ఏపీలో టమాటా ధర అమ్మబోతే అడవి.. కొనబోతే కొరివి అన్నచందంగా ఉంది. రైతు టమాటా అమ్మడానికి వెళ్తే.. తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. అదే వినియోగదారులు కొనుగోలు చేయబోతే మాత్రం రెట్టింపు ధరకు కొనుగోలు చేస్తారు. ఉమ్మడి కర్నూలు జిల్లా, అనంతపురం, చిత్తూరు జిలాల్లో టమోటా ధరలు ఒక్కసారిగా కుప్పకూలిపోయాయి. కిలో టమోటా ఐదు రూపాయలకు మించి పలకడం లేదు. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. మార్కెట్ లో టమాటా ధర తక్కువగా ఉన్నా.. వినియోదారుల వద్దకు వచ్చే సరికి మాత్రం కిలో రూ. 12 నుంచి 15 రూపాయలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉంది. ఉత్పత్తిదారుడికి వినియోగదారుడికి మధ్య వ్యత్యాసం కర్నూలు జిల్లాలో చాలా ఎక్కువగా ఉంది. ఈరోజు కర్నూలు రైతు బజార్ లో కిలో టమోటా 12 రూపాయలు ఉంది. రైతు అమ్మబోతే మార్కెట్ లో మాత్రం కేవలం ఐదు రూపాయలే పలుకుతోంది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు అనంతపురంలో టమోటా రైతుల ఆందోళనల ఉద్రిక్తతకు దారి తీసింది. సీపీఎం, రైతు సంఘాలతో కలసి రైతులు టమోటా బాక్సులతో టవర్ క్లాక్ వద్ద ఆందోళన దిగారు. రోడ్డు పై టమోటాలు పారబోసి నిరసన వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని సీపీఎంతో పాటు రైతు సంఘం నాయకులను అడ్డుకున్నారు. కాసేపు ఇరువురి మధ్య తోపులాట జరిగింది. చివరకు రైతు సంఘం నాయకులను అరెస్ట్ చేయడంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. టమాటా రైతుల ఆందోళనలతో టవర్ క్లాక్ వద్ద ఉద్రిక్త పరిస్తితులు నెలకొన్నాయి టమోటా రైతులను ఆదుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళను ఉంటాయని ప్రభుత్వానికి హెచ్చరించారు

# ఆయిల్ హబ్ గా కాకినాడ

కాకినాడ, ఆగస్టు 9, కాకినాడకు వంట నూనెల హబ్‌గానూ పేరుంది. ఈ విషయంలో కాకినాడ.. గుజరాత్ తర్వాత దేశంలోనే రెండో స్థానంలో నిలుస్తోంది. అలాగే రాష్ట్రంలో మొదటి స్థానాన్ని దక్కించుకుంటోంది. ఇండోనేషియా, మలేషియా, ఉక్రెయిన్, రష్యా తదితర దేశాల నుంచి ఇక్కడకు ముడి పామాయిల్ దిగుమతి అవుతోంది. ఇక్కడున్న 12 రిఫైనరీలలో ముడి వంట నూనెలను శుద్ధి చేసి పలు రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. భవిష్యత్‌లో వచ్చే కాకినాడ గేట్‌వే పోర్టుతో పారిశ్రామికంగా ఈ రంగం మరింత పరుగులు తీయనుంది. రాష్ట్ర ప్రభుత్వ పారిశ్రామిక విధానం కూడా ఇందుకు దోహదం చేయనుందని పారిశ్రామికవేత్తలు చెబుతున్నారు. కాకినాడలో ప్రభుత్వ రంగ యాంకరేజ్ పోర్టు, ప్రైవేటు రంగంలో కేఎస్‌పీఎల్ రెండు పోర్టులు ఉన్నాయి. ఇండోనేషియా, మలేషియా, ఉక్రెయిన్ నుంచి ఏటా 9 లక్షల మెట్రిక్ టన్నుల క్రూడ్ పామాయిల్‌ను కాకినాడ సీపోర్టుకు దిగుమతి చేసుకుంటున్నారు. విదేశాల నుంచి వచ్చే ముడి నూనెలను ఓడ సముద్రతీరాన జట్టీలో ఉన్నప్పుడే నేరుగా రిఫైనరీకి తరలించే ప్రత్యేక ఏర్పాటు ఇక్కడ ఉంది. అందుకే పలు రాష్ట్రాలకు చెందిన పారిశ్రామికవేత్తలు రిఫైనరీల ఏర్పాటుకు ముందుకు వచ్చారు. పోర్టు నుంచి రిఫైనరీలకు నేరుగా పైపులైన్లు ఉండటంతో సమయం, ఖర్చులు ఆదా అవుతున్నాయంటున్నారు. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే క్రూడ్ పామాయిల్‌ను కాకినాడ పరిసరాల్లో వాకలపూడి, వలసపాకల, సూర్యారావుపేటలలో 12 రిఫైనరీలలో శుద్ధి చేసి ప్యాకింగ్ చేస్తున్నారు. అదానివిల్‌మార్, అగర్వాల్, లోహియా, జెమిని, అమ్మిరెడ్డి, రుచిసోయ, భగవతి, సంతోషిమాత, శ్రీ గాయత్రి, వెంకట రమణ తదితర కంపెనీలు ముందు వరుసలో ఉన్నాయి. ఈ రిఫైనరీల్లో శుద్ధి చేసిన వంట నూనెలను వివిధ బ్రాండ్‌ల పేరుతోఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు తదితర రాష్ట్రాలకు ప్యాకింగ్ ఆయిల్, లూజు ఆయిల్‌గా రవాణా చేస్తున్నారు. రోజూ ట్యాంకర్ల ద్వారా 500 మెట్రిక్ టన్నుల ఆయిల్ (లూజు), 2,500 మెట్రిక్ టన్నులు లీటర్ చొప్పున ప్యాక్ చేసి ట్రక్కులలో కాకినాడ నుంచి పంపుతున్నారు. ప్రత్యక్షంగా సుమారు 20 వేల మంది, పరోక్షంగా 50 వేల మంది ఏడాది పొడవునా ఉపాధి పొందుతున్నారు. ప్రజల వినియోగానికి కోటి 40 లక్షల మెట్రిక్ టన్నుల వంట నూనెలు అవసరమని అంచనా. దేశీయంగా అందుబాటులో ఉండే వంట నూనెలు మినహాయిస్తే.. విదేశాల నుంచి 80 లక్షల మెట్రిక్ టన్నులు వరకు దిగుమతి అవుతున్నాయి. వీటిలో గుజరాత్‌లోని రెండు పోర్టులు ముడి వంట నూనెల దిగుమతిలో మొదటి స్థానంలో ఉన్నాయి. దేశంలో రెండో స్థానంలో, రాష్ట్రంలో మొదటి స్థానంలో కాకినాడ పోర్టు ఉంది. దేశవ్యాప్తంగా దిగుమతి అవుతున్న ముడి వంట నూనెల్లో 20 శాతం రాష్ట్రంలోని పోర్టులకు దిగుమతి అవుతున్నాయి. కాకినాడ సీపోర్టు ద్వారా ఏటా 9 నుంచి 10 లక్షల మెట్రిక్ టన్నులు దిగుమతి చేసుకుంటున్నారు. రాష్ట్రంలో కాకినాడ తర్వాత రెండో స్థానాన్ని కృష్ణపట్నం పోర్టు దక్కించుకుంటోంది.




# నల్లమల్లలో 73 పులులు...

కర్నూలు, ఆగస్టు 9,దేశంలోనే అతిపెద్ద అభయారణ్యమైన నల్లమల టైగర్ రిజర్వు ఫారెస్టులో 73 పెద్దపులులు ఉన్నట్లు పులుల గణనలో తేలింది. 2020లో 63 ఉండగా రెండేళ్లలో పెద్దపులుల సంఖ్య మరో పది పెరిగింది. ఇక్కడ 2018లో 47 పులులే ఉన్నాయి. పులుల గణన ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు కొనసాగింది.రాష్ట్రవ్యాప్తంగా వీటిసంఖ్య 75 ఉన్నట్లు అటవీ అధికారులు తెలిపారు. అదనంగా చేరిన రెండు పులులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి పాపికొండల్లో సంచరిస్తున్నట్లు గుర్తించారు. నాలుగేళ్లలో పులుల పెరుగుదల 60 శాతం ఉండటం గొప్ప విషయమని అటవీ అధికారులు తెలిపారు. నాగార్జునసాగర్ ఫారెస్టు నుంచి కూడా పులుల సంచారం జరుగుతోంది.

## సౌత్ కోస్ట్ జోన్ ఏర్పాటుకు అంతా రెడీ

విశాఖపట్టణం, ఆగస్టు 9,విశాఖ కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటుకు సర్వం సిద్ధం చేసినట్లు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టం చేశారు. భవన నిర్మాణానికి స్థల సేకరణ కూడా పూర్తయ్యిందని తెలిపారు. జోన్ ఏర్పాటుకు నిధులు కూడా సిద్ధంగా ఉన్నాయని అన్నారు. రాజ్యసభలో సోమవారం కేంద్రీయ విశ్వ విద్యాలయాల చట్ట సవరణ బిల్లుపై జరిగిన చర్చలో భాగంగా వైఎస్సార్సీపీ సభ్యులు విజయసాయి రెడ్డి విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుపై అడిగిన ప్రశ్నకు బదులిస్తూ రైల్వో జోన్ ఏర్పాటుకు సంబంధించిన డీపీఆర్‌ను ఆమోదించినట్లు మంత్రి తెలిపారు. అంతకు ముందు బిల్లుపై ఎంపీ విజయసాయి రెడ్డి మాట్లాడుతూ.. రైల్వేకు సంబంధించి రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలపై రైల్వే మంత్రికి పలు సూచనలు, సలహాలు చేశారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో భాగంగా విశాఖ కేంద్రంగా ప్రకటించిన సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటును వేగవంతం చేయాలని కోరారు. రైల్వే మంత్రిత్వ శాఖ వద్ద మూడు సంవత్సరాలుగా డీపీఆర్ పెండింగ్‌లోనే ఉ ందని ఆయన పేర్కొన్నారు.భారతీయ రైల్వే ప్రపంచంలోనే అతిపెద్ద రైల్వే వ్యవస్థ. 68 వేల కిలోమీటర్ల రైల్వే లైన్లు ఉన్నాయి. ప్రతి రోజు 21వేల ట్రైన్లు నడుస్తున్నాయి. దేశంలో 7,350 రైల్వే స్టేషన్ల నుండి ప్రతిరోజు 2.2 కోట్ల మంది ప్రయాణికులు ప్రయాణిస్తున్నారని విజయసాయి రెడ్డి తెలిపారు. రోజుకు 30 లక్షల టన్నుల సరుకు రవాణా జరుగుతుందని తెలిపారు. ఇంతటి గొప్ప వ్యవస్థకు సారధ్యం వహిస్తున్న రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను ఆయన అభినందించారు. విశాఖ కేంద్రంగా ఏర్పాటు చేయనున్న సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌లో రైల్వే రిక్రూట్మెంట్ బోర్డు ఏర్పాటు చేయాలని విజయసాయి రెడ్డి మంత్రిని కోరారు. దేశంలో మొత్తం 21 రైల్వే రిక్రూట్మెంట్ బోర్డులు ఉ న్నా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రైల్వే రిక్రూట్మెంట్ బోర్డు లేదు. దీంతో ఉద్యోగార్థులు రైల్వే పరీక్షల కోసం పక్క రాష్ట్రంలో సికింద్రాబాద్‌కు వెళ్లాల్సి వస్తుందని ఆయన అన్నారు.వైజాగ్ స్టీల్ ప్లాంటుకు డిమాండ్‌కు తగ్గట్టుగా వ్యాగన్లు అందుబాటులో లేకపోవడంతో బొగ్గు సరఫరాలో కృత్రిమ కొరత ఏర్పడుతోంది. తద్వారా ఉత్పత్తి కుంటుపడుతోందని విజయసాయి రెడ్డి అన్నారు. వ్యాగన్ల కొరత కారణంగా మహానది కోల్ ఫీల్డ్ నుంచి వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు తగినంతగా బొగ్గు సరఫరా చేయలేక పోతున్నారు. ఫలితంగా స్టీల్ ప్లాంటులో ఒక బ్లాస్ట్ ఫర్నేస్ మూసివేయాల్సి వచ్చింది. దీనివలన ఉక్కు ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం పడిందని అన్నారు. సాలీనా 28 వేల కోట్ల టర్నోవర్‌తో విజయవంతంగా నడుస్తున్న వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటుపరం చేయాలనుకోవడం సరికాదని ఆయన అన్నారు. లాభాల బాటలోనున్న సంస్థలు ప్రైవేటు పరం చేయకూడదన్నది బీజేపీ ప్రభుత్వం విధానం అయినప్పటికీ విశాఖ స్టీల్ ప్లాంటును ప్రైవేటుపరం చేయాలనుకోవడం శోచనీయని అన్నారు.

## శ్రీశైలం జలాశయానికి భారీగా వస్తున్న వరద

**ప్రాజెక్ట్ ఐదు గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల**



శ్రీశైలంశ్రీశైలం జలాశయానికి కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతుంది ఎగువ పరీవాహక ప్రాంతాల నుంచి భారీగా వరదనీరు వస్తుండటంతో జలాశయం నిండుకుండలా తలపిస్తుంది. జూరాల,సుంకేసుల నుండి ఇన్ ఫ్లో అధికంగా ఉండడంతో ఐదు గేట్లు 10 అడుగుల మేర ఎత్తి దిగువ నాగార్జున సాగర్ కు నీటిని అధికారులు విడుదల చేస్తున్నారు గంటగంటకు ఇన్ ఫ్లో పెరుగుతుండటంతో జలాశయం గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు జలాశయానికి ప్రస్తుతం ఇన్ ఫ్లోగా 1,73,695 క్యూసెక్కులు ఉ ండగా ఔట్ ఫ్లోగా ఐదు గేట్ల ద్వారా 1,39,915 వేల క్యూసెక్కులు అలానే కుడి,ఎడమ జల విద్యుత్ ఉత్పత్తి చేస్తూ 62,897 క్యూసెక్కులు మొత్తం ఔట్ ఫ్లోగా 2,02,812 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు అయితే శ్రీశైలం జలాశయం పూర్తిస్దాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 884.80 అడుగులగా ఉంది అలానే జలాశయం పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 215 టీఎంసీలు కాగా ప్రస్తుతం 214.3637 టీఎంసీలుగా ఉ ంది అయితే వరద భారీగా ఇలాగే కొనసాగితే రేడియల్ క్రేస్ట్ గేట్లలో మరో సాయంత్రానికి ఒకటీ లేదా రెండు గేట్లు ఎత్తనున్నట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు

## ప్రతి ఒక్కరు దేశభక్తిని పెంపొందించుకోవాలి

**-ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలి**

**-పెద్దపల్లి జెడ్పీ ఛైర్మన్ పుట్ట మధూకర్**

మంథని ప్రతి ఒక్కరు దేశభక్తిని పెంపొందించుకోవాలని పెద్దపెల్లి జెడ్పి చైర్మన్, టీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ పుట్ట మధూకర్ అన్నారు. 75వ స్వాతంత్ర్య వజ్రోత్సవాల్లో బాగంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ ఆధ్వర్యంలో మంథని అంబేద్కర్ చౌరస్తాలో మంగళవారం జాతీయ జెండాల పంపిణీ కార్యక్రమానికి పుట్ట మధు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలన్నారు. బావితరాలకు స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను, ఉద్యమ చరిత్రను తెలియజేయాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. 75వ స్వాతంత్ర్య దినోత్సవ వజ్రోత్సవాల సందర్బంగా ఈ నెల 9నుంచి 22వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని, ప్రతి కార్యక్రమాన్ని మంథని నియోజకవర్గంలో విజయవంతం చేస్తామన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటిచెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. 12రోజుల పాటు నిర్వహించే ప్రతి కార్యక్రమాన్ని స్ధానిక ప్రజాప్రతినిధులు విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుట్ట శైలజ, వైస్ చైర్మన్ ఆరేపల్లి కుమార్, ఎంపీపీ కొండ శంకర్, మంథని సిఐ సతీష్, నాయకులు యెగోళపు శంకర్ గౌడ్ ఆకుల కిరణ్, బత్తుల సత్యనారాయణ లతోపాటు పలువురు పాల్గొన్నారు.

# బలపడుతున్న జనసేన




ఏలూరు, ఆగస్టు 9, గత ఎన్నికల్లో జనసేన పార్టీకి ఘోరమైన ఫలితాలు వచ్చిన విషయం తెల్సిందే?కేవలం ఆ పార్టీకి ఒక సీటు మాత్రమే దక్కింది?అలాగే పవన్ కల్యాణ్ పోటీ చేసిన రెండు చోట్ల ఓటమి పాలయ్యారు. అయితే ఇదంతా గత ఎన్నికల విషయం?కానీ ఇప్పుడు ఏపీలో రాజకీయ పరిణామాలు మారుతున్నాయి. అధికార వైసీపీ బలం నిదానంగా తగ్గుతూ వస్తుంది?అదే సమయంలో టీడీపీ బలం కాస్త పెరుగుతుంది. అలాగే జనసేన బలం కూడా కొద్దిగా పెరుగుతూ వస్తుంది.వైసీపీకి మైనస్ అయ్యే ప్రతి ఓటు?టీడీపీకి లేదా జనసేనకు ప్లస్ అవుతుంది. అయితే నెక్ట్స్ ఎన్నికల్లో జనసేన ఖచ్చితంగా ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయి. టీడీపీ తో పొత్తు ఉంటే రాజకీయం వేరుగా ఉంటుంది..అప్పుడు జనసేనకు మంచి ఫలితాలు వస్తాయి. ఒకవేళ సింగిల్ గా పోటీ చేస్తే గత ఎన్నికల్లో మాదిరిగా దారుణమైన ఫలితాలు రావు గాని?ఈ సారి కాస్త బెటర్ ఫలితాలు వస్తాయని తెలుస్తోంది.ముఖ్యంగా కొన్ని సీట్లలో వైసీపీ-టీడీపీలకు ధీటుగా జనసేన ఎదుగుతున్నట్లు తెలుస్తోంది. ఇదే క్రమంలో జనసేన?ఓ రెండు సీట్లలో మాత్రం ఖచ్చితంగా గెలిచే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. గత ఎన్నికల్లో గెలిచిన రాజోలులో మరోసారి జనసేనకు గెలుపు అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక్కడ వైసీపీపై నెగిటివ్ ఉంది..అటు టీడీపీ పెద్దగా బలపడలేదు. అదే సమయంలో జనసేనకు స్ట్రాంగ్ ఓటింగ్ ఉంది. ఇక్కడ జనసేనకు గెలుపు అవకాశాలు కనిపిస్తున్నాయి.ఇక రెండోది..గత ఎన్నికల్లో జనసేన తక్కువ ఓట్ల మెజారిటీతో ఓడిపోయిన నరసాపురం అసెంబ్లీ?ఇక్కడ జనసేన పక్కాగా గెలవచ్చని సర్వేలు చెబుతున్నాయి. పవన్ ఎక్కడ పోటీ చేస్తే అక్కడ గెలవడం సులువే అని చెప్పొచ్చు. మొత్తానికైతే జనసేనకు ఆ రెండు సీట్లలో డౌట్ లేదుజనసేనలోకి బాలినేనిట్విట్టర్ వేదికగా పవన్ కళ్యాణ్ విసిరిన చేనేత ఛాలెంజ్ ను వైసీపీ నేత బాలినేని స్వీకరించారు. చేనేత వస్త్రాలతో రూపొందించిన చొక్కా ధరించి ట్విట్టర్లో పోస్ట్ చేశారు బాలినేని. ట్విటర్ వేదికగా చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత దుస్తులు ధరించి ఫొటోలు దిగాలంటూ పవన్ కళ్యాణ్ చేసిన చేనేత సవాల్ ను స్వీకరించానని వెల్లడించారు వైసీపీ సీనియర్ నేత బాలినేని.నేను చిత్తశుద్ధితో చేనేత మంత్రిగా వైఎస్ ప్రభుత్వంలో పని చేశానని.. ఆనాడు వైఎస్సార్ రూ. 300 కోట్లు చేనేతల కోసం రుణమాఫీ చేశారని వెల్లడించారు. ఇవాళ మా నాయకుడు జగన్ ప్రభుత్వంలోనూ నేతన్నల సంక్షేమం కోసం వైఎస్సార్ నేస్తం దగ్గర నుంచి ఎన్నో పథకాలు అందిస్తున్నామని వివరించారు.అప్పుడైనా, ఇప్పుడైనా చేనేతల సంక్షేమంకోసం, వారి అభివృద్ధికోసం నిజాయితీతో పని చేస్తున్నామన్నారు. అందరూ చేనేత వస్త్రాలు ధరించండని పిలుపునిచ్చారు. అయితే.. పవన్ కళ్యాణ్ ఛాలెంజ్ విసరగానే వైసీపీ సీనియర్ నేత బాలినేని.. స్వీకరించడంతో.. ఏపీ రాజకీయాలు హాట్ టాపిక్ గా మారాయి. జనసేన పార్టీలోకి బాలినేని వెళుతాడంటూ ప్రచారం మొదలైంది. కాగా.. మంత్రి వర్గ విస్తరణ తర్వాత వైసీపీపై బాలినేని అసంతృప్తిలో ఉన్నట్లు సమచారం.

# వృద్ధ దంపతుల దారుణ హత్య

విశాఖపట్నం విశాఖ జిల్లా పెందుర్తి మండలంలోని చినముషిడివాడలో నిర్మాణంలో వున్న అపార్టుమెంట్ సెల్లార్లో వృద్ధ దంపతులు హత్య కలకలం రేపింది.ఉపాధి కోసం వచ్చి హత్యకు గురికావడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నా యి.స్థానికంగా సంచలనంగా మారిన ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.విజయనగరం జిల్లా బలిజిపేట మండలం అజ్జాడ గ్రామానికి చెందిన సుటారి అప్పారావు , లక్ష్మి దంపతులు ఉపాధి నిమిత్తం కొన్నేళ్ల క్రితం విశాఖ వచ్చారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉ న్నారు. పెద్ద కుమారుడు సత్యనారాయణ నగరంలోని బర్మా క్యాంప్ లో వుంటూ ఆటోడ్రైవర్ గా పనిచేస్తున్నాడు. చిన్నకుమారుడు, కుమార్తె హైదరాబాద్లోని అపార్టుమెంట్లలో వాచ్మెన్లుగా పనిచేస్తున్నారు. రెండేళ్ల క్రితం వరకూ అప్పారావు చినముషిడివాడ ప్రాంతంలో వేర్వేరు అపార్టుమెంట్లలో వాచ్మన్ గా పనిచేశాడు. ఇరవై రోజుల క్రితం గ్యాస్ గోడౌన్ వెనుక గల సప్తగిరి నగర్లో సమీపంలో నిర్మాణంలో వున్న అపార్ట్మెంటులో వాచ్మన్ గా చేరాడు. సెల్లార్ లో భార్యాభర్తలు ఉంటున్నారు.కాగా అపార్టుమెంట్ సూపర్వైజర్ నీల్ కాంత్ సోమవారం ఉదయం ఇక్కడకు వచ్చి వాచ్మన్ గది వైపు చూసి వారు నిద్రపోతున్నారని భావించి నాలుగో అంతస్థులో ప్లంబింగ్, విద్యుత్ పనులు జరుగుతుండడంతో అక్కడకు వెళ్లారు. వాచ్మన్ వద్ద వుంచిన తన ల్యాప్టాప్ బ్యాగ్ ను తీసుకునేందుకు మధ్యాహ్నం 12 గంటల సమయంలో వారి గదికి వెళ్లారు. వాచ్మన్ దంపతులు రక్తపు మడుగులో వుండడాన్ని గుర్తించి వెంటనే భవన నిర్మాణదారుడికి సమాచారాన్ని అందించారు. భవన యజమాని సూచన మేరకు పోలీసులకు సమాచారాన్ని అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి క్లూస్ టీమ్ తో చేరుకున్నారు. పోలీస్ జాగిలాలు అపార్టుమెంట్ నుంచి కొంతదూరం వరకు వెళ్లి ఆగిపోయాయి. ఘటనా స్థలంలో లభ్యమైన నాలుగడుగుల పొడవైన సరుగుడు కర్రను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వృద్ధ దంపతులను బంగారం, నగదు కోసం హతమార్చి వుండరని, కక్ష సాధింపులో భాగంగా హత్య చేసి వుంటారని పోలీసులు భావిస్తున్నారు. ఘటనా స్థలిలోని టార్పాలిన్లపై రక్తపు మరకలు వుండడంతో దంపతులకు, దుండగులకు మధ్య పెనుగులాట జరిగి వుంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇద్దరు, ముగ్గురు కలిసి ఈ హత్యలకు పాల్పడి వుంటారని భావిస్తున్నారు. ఘటనా స్థలిలో సరుగుడు కర్ర తప్ప ఎటువంటి ఆధారాలు లభ్యం కానందున దానితోనే వారిని కొట్టి చంపి వుండవచ్చునని అనుకుంటున్నారు. దంపతుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్కు తరలించారు. క్రైమ్ డీసీపీ సునీల్ సుమిత్ గరుడ, ఏసీపీ పెంటారావు, సీఐ అశోక్ కుమార్, సిబ్బంది ఘటనా స్థలాన్ని సందర్శించారు. పోస్టుమార్టం రిపోర్టు వచ్చాక కేసులో పురోగతి వుంటుందని ఏసీపీ పెంటారావు తెలిపారు. కాగా హత్యకు గురైన దంపతుల పెద్ద కుమారుడు సత్యనారాయణ సంఘటనా స్థలానికి చేరుకుని..తమకు ఆస్తులు, భూములు లేవన్నారు. తమ తల్లిదండ్రులను ఎవరు..ఎందుకు హత్య చేశారో తెలియడం లేదని విలపించారు. సీఐ అశోక్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి -నేతన్నలను ప్రోత్సహించాలి

**జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర బాబు**

నెల్లూరు .నెల్లూరు నగరంలోని కస్తూరి దేవి బాలికల విద్యాలయం ప్రాంగణంలో ఏర్పాటుచేసిన చేనేత ప్రదర్శనను జిల్లా ప్రజలందరూ సందర్శించి, విరివిగా చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి చేనేత కళాకారుల వృత్తి, నైపుణ్యాన్ని ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ కె వి ఎన్ చక్రధర్ బాబు పిలుపునిచ్చారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని కస్తూర్బా బాలికల విద్యాలయం (రవీంద్రనాథ్ ఠాగూర్ భవన్)లో నాబార్డు సహకారంతో చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శన, విక్రయ దుకాణాలను కలెక్టర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా నిర్వహించిన సభలో కలెక్టర్ చక్రధర్ బాబు మాట్లాడుతూ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 7వ తేదీ నుంచి 13వ తేదీ వరకు 30 చేనేత వస్త్రాల విక్రయ స్టాళ్లతో కస్తూరి దేవి బాలికల విద్యాలయంలో ఈ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అన్ని జిల్లాల నుంచి పేరెన్నికగల కళాకారులు ఈ ప్రదర్శనలో పాల్గొనడం సంతోషకర విషయం అన్నారు. ప్రాచీన కళలు మరుగున పడిపోకుండా, చేనేత కార్మికులకు అండగా, వారి శ్రమకు గుర్తింపు, గౌరవం ఇస్తూ ఈ ప్రదర్శనలో ఏర్పాటుచేసిన చేనేత వస్త్రాలను ప్రజలందరూ కొనుగోలు చేయాలని కోరారు. సుమారు 300 గంటలపాటు మగ్గం మీద కార్మికుడు శ్రమిస్తే ఒక చీర తయారవుతుందని, అదే పవర్ హ్యాండ్లూమ్స్ మిషన్ల ద్వారా 3 నిమిషాల్లో తయారయ్యే చీర ఎక్కువ కాలం మన్నిక ఉండదని, అదే మగ్గం మీద నేసిన చీర ఎంతో నాణ్యంగా ఉంటుందని, నేతన్న కష్టానికి ప్రజలంతా తమ సహకారం అందించి వారి కుటుంబాలకు ఆర్థిక స్వావలంబన చేకూర్చాలన్నారు.ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి జిల్లాలోని అధికారులంతా తప్పకుండా చేనేత వస్త్రాలు ధరించి రావాలన్నారు. నగర మేయర్ స్రవంతి మాట్లాడుతూ మనదేశంలో వ్యవసాయ రంగం తరువాత చేనేత రంగానికి అత్యంత ప్రాధాన్యత ఉందని, ప్రతి ఒక్కరు కూడా చేనేత కళాకారులను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. తొలుత పోలీసు పరేడ్ గ్రౌండ్ నుంచి కస్తూర్బా బాలికల హైస్కూల్ వరకు చేనేత కార్మికులతో నిర్వహించిన ర్యాలీని కలెక్టర్ ప్రారంభించి పాల్గొన్నారు.కెనరా బ్యాంకు సహకారంతో చేనేత కార్మికులకు రుణాలు పంపిణీ.ఈ సందర్భంగా కెనరా బ్యాంకు సహకారంతో ఏఎస్ పేట, కావలి ఎడవల్లి, సౌత్ మోపూరు గ్రామాలకు చెందిన చేనేత కార్మికులకు ముద్రా పథకం కింద కోటి రూపాయల రుణాలను అందించారు. ఏఎస్ పేట లోని 175 మంది చేనేత కార్మికులందరికీ సంతృప్తికర స్థాయిలో ముద్ర రుణాలను అందించినట్లు ఎల్డిఎం శ్రీకాంత్ ప్రదీప్ కుమార్ పేర్కొన్నారు. ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ఆధ్వర్యంలోనారాయణ రెడ్డి పేట గ్రామంలోని చేనేత కార్మికులకురుణాలు మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్,నగరపాలక సంస్థ కమిషనర్ హరిత, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీకాంత్ ప్రదీప్ కుమార్, చేనేత, జౌళి శాఖ ఏడి శ్రీ ఆనంద్ కుమార్, నాబార్డు డిజిఎం కెవిఎస్ ప్రసాద్, డి ఆర్ ఎం మణిశేఖర్, డిడిఎం రవిసింగ్, ఏపీజీబీ ఆర్ఎం శైలంద్రనాథ్, జడ్పీ సీఈవో వాణి, సోషల్ వెల్ఫేర్ డిడి రమాదేవి, చేనేత కార్పొరేషన్ డైరెక్టర్ ఆదిలక్ష్మి, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు గుత్తికొండ శ్రీనివాసులు, జాతీయ చేనేత ఐక్యవేదిక జిల్లా పార్లమెంట్ కన్వీనర్ దోనేపూడి కోటేశ్వరరావు, తొగట కార్పొరేషన్ డైరెక్టర్ రమణయ్య, మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాదయ్య, చేనేత కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 14 నుంచి 18 వరకూ సీపీఐ జాతీయ మహాసభలు

విజయవాడ, ఆగస్టు 9, (న్యూస్ పల్స్)అక్టోబర్ 14వ తేదీ నుంచి 18వ తేదీ వరకు విజయవాడలో సీపీఐ జాతీయ మహా సభలు నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ ప్రకటించింది. జాతీయ మహాసభల పోస్టరును ఆవిష్కరించిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ సభల వివరాలు వెల్లడించారు. సీపీఐ జాతీయ మహా సభలు నాలుగేళ్ల తరువాత జరుగుతున్నాయన్నారు. 24వ జాతీయ మహా సభలు విజయవాడలో ఘనంగా జరుపుకుంటున్నాం. 1961, 1975లో గతంలో విజయవాడ జాతీయ సమావేశాలు జరిగాయి. 47 ఏళ్ల తరువాత మళ్లీ ఇక్కడ సభలు నిర్వహిస్తున్నాం. అక్టోబర్ 14న భారీ ర్యాలీ, సభలో డి.రాజా ఇతర నాయకులు పాల్గొంటారు.18వ తేదీ వరకు జరిగే సభల్లో అన్ని రాష్ట్రాల నుంచి వెయ్యి మంది ప్రతినిధులు వస్తున్నారు. ఇతర దేశాల్లో ఉన్న కమ్యూనిస్టు నాయకులు హాజరవుతారు. సీపీఎం నుంచి సీతారాం ఏచూరి, ఇతర వామపక్ష నాయకులు సౌభాగ్య సందేశం ఇస్తారు. నరేంద్ర మోడీ పాలనలో దేశం అన్ని విధాలా నష్టపోయింది. ప్రజాస్వామ్యానికి పాతర వేసి ఏక వ్యక్తి పాలన సాగిస్తున్నారు. ప్రతిపక్షాల గొంతు నొక్కడానికి బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తున్నారు. ప్రభుత్వం వైఫల్యాలను ప్రశ్నిస్తే అన్యాయంగా జైళ్లల్లో పెడుతున్నారు.ఇళ్లకు సీబీఐ, ఐటీ వాళ్లని పంపి బెదిరిస్తున్నారు. సోనియా గాంధీని కూడా విచారణ పేరుతో ఇబ్బందులు పెట్టారు. ఎనిమిదేళ్ళ పాలనలో దేశాన్ని అప్పుల పాలు చేశారు. బ్లాక్ మనీ తేలేదు, ఉద్యోగాలు లేవు?.47 లక్షల కోట్లు అప్పు ఉంటే.. రూ. 155 లక్షల కోట్లకు చేర్చారు. ప్రభుత్వ రంగ సంస్థలు కూడా ప్రైవేటు పరం చేశారు.

## పీరు అంటే గొప్పవారు

బ్రాహ్మణ కొట్కూరు నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం బ్రాహ్మణ కొట్కూరు ప్రతి సంవత్సరం పీర్ల పండగ జరుపుకుంటున్నారు. ఈ పండగ మొహర్రం అనగా ముస్లిం క్యాలెండర్ ప్రకారం కొత్త నెల అలాగే త్యాగాల తోనే సంవత్సరం అంతమవుతుంది అదే రకంగా త్యాగాల తోనే కొత్త సంవత్సరం ప్రారంభం అవుతుంది ఇది మానవాళికి జీవితం ఎలా గడపాలని నేర్పిస్తుంది. జగత్ ప్రవక్త మహమ్మద్ రసూల్లహ సో:స గారి మనవడు అయినా ఇమామే హుస్సేన్(రజి) ధర్మం కోసం తాతగారు తెచ్చిన ధర్మాన్ని ఆచరించుట కొరకు తన ప్రాణాలను కోల్పోయారు దుర్మార్గులు ఇమామే హుసేన్(రజి) అసరు నమాజ్ లో ఉండగా శత్రువులు షహిద్ చేశారు.నమాజ్ సమయంలో యుద్ధం చేయకుండా దైవ ప్రార్ధన గొప్పదని ప్రపంచం అంతము వరకు వచ్చే ప్రజలకు తెలియ చెప్పడానికి నమాజ్ ను వదలకుండా ప్రాణాలను వదిలారు. ఈ పీర్ల ఊరేగింపు లో( ముజావర్లు) షాలి భాష, రబ్బాని, ఇబ్రహీం, చాంద్ భాష, మరియు పీర్ల స్వాములు. ఖాజా మొహిద్దిన్,( ఎస్ కే మ్)పఠాన్ గౌస్ ఖాన్, ఖాజా హుస్సేన్, ఖలీల్,దూద్ పీరా, చాకలి రాజు, అనకలి గోపాల్, ఖుదూస్ పాల్గొన్నారు. గ్రామ ప్రజలు మొహర్రం ను ఘనంగా జరుపుకున్నారు.

## హార్ ఘర్ పే తిరంగ్ ర్యాలీ

బ్రాహ్మణ కొట్కూర్ నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం భారతదేశానికి స్వాతంత్రం వచ్చి75 సంవత్సరాలు శుభ సందర్భముగా వజ్రోత్సవం భాగంగా ప్రధానమంత్రి, పిలుపుమేరకు ఇంటి ఇంటిట మీద మువ్వెన్నెల జెండా ఎగర వేస్తూ స్వాతంత్ర్య సమర ఉత్సవాన్ని జరుపుకోవాలని. దేశ పౌరులకు పిలుపునిచ్చారు. ఈ పిలుపు మేరకు బ్రాహ్మణ కొట్కూరు గ్రామంలో పొదుపు సంఘాల మహిళలు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ఎలిమెంటరీ పాఠశాల నుండి వైఎస్ఆర్ విగ్రహం వరకు కొనసాగింది. . ర్యాలీలో పొదుపు సంఘాల మహిళలతో పాటు నందికొట్కూరు. మండలం ఏపిఎం మధు, సిసి దాస్, మరియు బుక్ కీపర్ కమ్మరి శంకరాచారి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని అంబేద్కర్ సంఘం నాయకులు విజయవంతం చేయాలి

చొప్పదండి కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలోని అన్ని గ్రామాల అంబేద్కర్ యువజన సంఘం నాయకులు ఆగష్టు 15 జెండా పండుగ వారోత్సవాలు ఘణంగా నిర్వహించాలని గంగాధర మండల డా బీ ఆర్ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు మ్యాక వినోద్ కోరారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యువజన సంఘం భవణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అధ్యక్షుడు మేక వినోద్ మాట్లాడుతూ గంగాధర మండల ముఖ్య సలహాదారులు మరియు మండలంలోని అన్ని గ్రామాల గ్రామ శాఖ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు ముఖ్య నాయకులు అంబేద్కర్ యువజన సంఘం మండల భవనంలో హాజరై ఆగష్టు 15 జండా కార్యక్రమం గురించి చర్చించి జెండా పండుగ వారోత్సవాలు 13 తారీకున మండలంలోని ప్రతి గ్రామంలో ఉన్నటువంటి అంబేద్కర్ యువజన సంఘం భవనం ఆవరణ లో శుభ్రపరచుకొనుట శ్రమదాన కార్యక్రమం చేసుకోవడం 14న స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్ల పంపిణీ కార్యక్రమం 15న ఉదయం 8:40 కి మండల భవనంలో జెండా కార్యక్రమం నిర్వహించుకోవాలని తెలియజేశారు..తదుపరి అనాధాశ్రమంలోని పిల్లలకు పెన్నులు బుక్స్ పంపిణీ చేస్తూ ఈ వారోత్సవాలను ముగించుకోవాలని తీర్మానం చేసారు. ఈ కార్యక్రమంలో సలహాదారులు లింగాల దుర్గయ్య, దోమకొండ మల్లయ్య, రోమాల రమేష్, ద్యావ.సంజీవ్,సముద్రాల మొండయ్య, మరియు మండల ప్రధాన కార్యదర్శి తాళ్ల రాజేశం, ఉపాధ్యక్షులు గంగాధర.రఘు, పోతర్తారి. ప్రభాకర్ దొబ్బల.లక్ష్మణ్, మరియు మండలంలోని అంబేద్కర్ యువజన సంఘం గ్రామ శాఖ అధ్యక్షులు లంక దాసరి రత్నం, బండపల్లి ఆనందం,గంగాధర మధు,ఎడపల్లి మోహన్, పోత్తూరి శంకర్, కొలేపాక మల్లేశం,లింగాల.నర్సయ్య, గుంటుకు.జితేందర్, కల్లేపల్లి గంగసాగర్, మరియు మండల నాయకులు గంగాధర శంకర్, గంగాధర మోహన్, గుంటుకు.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు..

## మంథని బస్ స్టేషన్ లో ఈనెల 22 వరకు జాతీయ గీతాలాపన

మంథని మంథని టిఎస్ ఆర్టిసి డిపోలో 75వ స్వతంత్ర దినోత్సవం సందర్భంగా ఈనెల 9 నుండి 21 వరకు ఆజాదిక అమృత్ మహోత్సవ్ కార్యక్రమాన్ని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్లు మంథని బస్ డిపో మేనేజర్ టి. శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఈ కార్యక్రమంలో భాగంగా మంథని బస్ స్టేషన్ లో ఉదయం 11 గంటలకు జాతీయ గీతాలాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులతో పాటు ప్రయాణికులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జాతీయ గీతాలపన చేశారు. ఈ సందర్భంగా డిఎం శ్రీనివాస్ మాట్లాడుతూ మంథని బస్ స్టేషన్ తో పాటు మంథని డిపోలో ఈ నెల 22 వరకు జాతీయ గీతాలాపన కార్యక్రమం ఉంటుందని, ఈ కార్యక్రమంలో ప్రయాణికులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బస్ డిపో సూపర్డెంట్ శ్రీధర్, ట్రాఫిక్ ఇంచార్జ్ అశోక్ రావు ,బస్టాండ్ కంట్రోలర్ కేఆర్ రెడ్డి, సిస్టం సూపర్వైజర్ బికే స్వామి, బస్సు పాస్ కౌంటర్ ఆపరేటర్ టి.గణేష్ తో పాటు ప్రయాణికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వాహనం ఢీకొని మహిళ మృతి

గుంటూరు యడ్లపాడు మండలం తిమ్మాపురం జాతీయ రహదారిపై మంగళవారం వాహనం ఢీకొని మహిళ మృతి చెందింది. తిమ్మాపురం హైవే జంక్షన్ సమీపంలో ఉన్న చర్చి ఎదురుగా రోడ్డు దాటుతున్న కాలనీకి చెందిన మరియమ్మను చిలకలూరిపేట వైపు వెళ్లే గుర్తుతెలియని కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో మరియమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు దర్యాప్తు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం మహిళ మృతి దేహాన్ని చిలకలూరిపేట ప్రభుత్వ హాస్పిటల్ కు తరలించారు

# కర్నూలు జిల్లాను సేఫ్ సిటీ గా తీర్చుదిద్దుతాం



**జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఐపియస్**
**జిల్లా ప్రజలకు మెరుగైన సేవలందిస్తాం**
**అభద్రత భావం లేకుండా భద్రత ను కల్పించే విధంగా చర్యలు తీసుకుంటాం**
**కర్నూలు నగరంలో ట్రాఫిక్ క్రమబద్దీకరణకు ఆధునిక అధిక నాణ్యత కలిగిన పర్సనల్ కిట్స్ ( కౌబాయ్ టోపి, చలువ అద్దాలు, విశ్రాంతి ఛైర్ ) లను కర్నూలు ట్రాఫిక్ పోలీసులకు అందజేసిన జిల్లా ఎస్పీ**



కర్నూలు ఆగష్టు 09 ( విభారె) –: కర్నూలు నగరంలోని కొండారెడ్డి బురుజు దగ్గర మంగళవారం ట్రాఫిక్ పై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఐపియస్ హాజరై మాట్లాడారు. కర్నూలు పట్టణాన్ని సురక్షితమైన నగరంగా తీర్చుదిద్దుతామన్నారు. రాబోయే రోజుల్లో కర్నూలు పట్టణంలో సిసి కెమెరాలను పెంచే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజల సహకారం కూడా తీసుకుంటామన్నారు. మహానగరాల్లో పని చేస్తున్న ట్రాఫిక్ పోలీసులను స్టడీ చేసి వారితో పాటు గా కర్నూలు ట్రాఫిక్ పోలీసులకు కూడా ఆధునిక అధిక నాణ్యత కలిగిన పోలీసు కిట్స్ ను అందజేశామన్నారు. 64 మంది నుండి 120 మంది వరకు కర్నూలు ట్రాఫిక్ పోలీసు సిబ్బందిని పెంచడం జరిగిందన్నారు. కర్నూలు జిల్లాలో ఉన్నటువంటి 34 ముఖ్యమైన ట్రాఫిక్ పాయింట్లు, ముఖ్యమైన జంక్షన్ లలో హై పవర్ లౌడ్ స్పీకర్లను ఏర్పాటు చేశామన్నారు. ట్రాఫిక్ ఎన్ ఫోర్స్ మెంట్ తో పాటు , ట్రాఫిక్ పై అవగాహన కల్పించేవిధంగా చర్యలు చేపట్టామన్నారు. బ్లాక్ స్పాట్స్ ను కూడా గుర్తించామన్నారు. కర్నూలు పట్టణం, శివారు ప్రాంతాలలో అభద్రతా భావం ఉండే ప్రాంతాలలో పోలీసు పెట్రోలింగ్ ను పెంచుతామన్నారు. క్రైమ్ హాట్ స్పాట్స్ పెట్రోలింగ్ ను కూడా పెంచుతామన్నారు. ప్రజల సంరక్షణకు , మంచి సేవలందించే విధంగా పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ డి. ప్రసాద్, డిఎస్పీలు యుగంధర్ బాబు, కె వి మహేష్, సిఐలు, ఆర్ ఐలు, ఎస్సైలు, ట్రాఫిక్ కానిస్టేబుళ్ళు పాల్గొన్నారు.

# వచ్చే శుక్రవారం నాటికి మొదలు పెట్టని ప్రయారిటీ భవనాలు ఉండకూడదు :- జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు




కర్నూలు, ఆగస్ట్ 08 :-మొదలు కాని ప్రయారిటీ భవనాల నిర్మాణాలను వచ్చే శుక్రవారం నాటికి మొదలు పెట్టాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు పంచాయతీ రాజ్ శాఖ ఈ ఈ, డి ఈ లను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైయస్సార్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాల పురోగతిపై పంచాయితీ రాజ్ శాఖ ఈ ఈ, డి ఈ లతో కలెక్టర్ మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో 1257 ప్రయారిటీ భవనాలు మంజూరు అయితే అందులో ఆదోని, ఆస్పరి, దేవనకొండ, హాలహర్వి, హోలగుండ, కోసిగి, కౌతళం, మంత్రాలయం, పెద్దకడుబూరు, గొనెగండ్ల, నందవరం, ఎమ్మిగనూరు, కర్నూలు, ఓర్వకలు, పత్తికొండ, తుగ్గలి, వెల్దుర్తి మండలాల్లో 105 ప్రయారిటీ భవనాల నిర్మాణం మొదలు పెట్టలేదని వచ్చే శుక్రవారం నాటికి ఖచ్చితంగా పనులు మొదలు పెట్టాలని,, ఏ ఒక్క ప్రయారిటీ భవననీ కూడ మొదలు కాకుండా ఉండకూడదని ఈ ఈ, డి ఈ లను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సిమెంట్, స్టీల్ మరియు ఇసుక లో ఏమైనా సమస్యలు ఉంటే నా దృష్టికి తీసుకొని వస్తే పరిష్కారం చేస్తనన్నారు. మిగిలిన భవన నిర్మాణాలను బిలో బేస్మెంట్ లెవెల్ లో ఉన్నవి బేస్మెంట్ లెవెల్ కు, బేస్మెంట్ లెవెల్ లో ఉన్నవి రూఫ్ లెవెల్ కు, రూఫ్ లెవెల్ లో ఉన్నవి, ఫినిషింగ్ స్టేజ్ కు తీసుకొని వచ్చేల చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పంచాయతీ రాజ్ ఎస్ఈ ను ఆదేశించారు. మన బడి నాడు నేడు పనులకు సంబంధించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 1079 పాఠశాలలకు గాను ఇప్పటికే 1056 పాఠశాలలకు ఎస్టిమేషన్ జనరేషన్ చేయగా మిగిలిన 23 పాఠశాలలకు కూడ ఎస్టిమేషన్ పూర్తి చేయాలని అన్నారు. జిల్లాలో మండల వారీగా పెండింగ్ లో ఉన్న లిస్ట్ ను మండల విద్యాశాఖ అధికారి కి చెప్పి హెడ్ మాస్టర్ లాగిన్ లో పెండింగ్ లో ఉన్న వాటిని క్లియర్ చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యా శాఖ అధికారి రంగ రెడ్డి ని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.. అదే విధంగా సమగ్ర శిక్ష అభియాన్ పి ఓ మరియు జిల్లా విద్యా శాఖ అధికారి సమన్వయంతో పనిచేసి ఏ ఏ శాఖలో ఏ అధికారి దగర పెండింగ్ లో ఉన్నాయో వాటిని మొత్తం క్లియర్ చేసి అన్ని పాఠశాలలను రివాల్వినీగ్ ఫండ్ జనరేటేడ్ స్టేజ్ కు తీసుకొని రావాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్ ఎస్ ఈ సుబ్రమణ్యం,జడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య, సిపిఓ అప్పలకొండ, డ్వామా పిడి అమర్నాథ్ రెడ్డి, సర్వ శిక్షా అభియాన్ పి ఓ, పంచాయతీ రాజ్ శాఖ ఈఈలు,డిఈలు, పాల్గొన్నారు

# నంద్యాల జిల్లా యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఏకగ్రీవ ఎన్నిక



నంద్యాల ఆగష్టు 09 –: యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో మంగళవారం ఆళ్లగడ్డలోని ఆవుల విజయభాస్కర్ రెడ్డి సేవా సమితి కార్యాలయంలో నంద్యాల జిల్లా యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. నూతన కమిటీ ఛైర్మన్ ఆవుల విజయ భాస్కర్ రెడ్డి, అధ్యక్షులుగా బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా హనుమంత రెడ్డి, కోశాధికారిగా సుదీప్,ఉపా ధ్యక్షుడిగా బ్రహ్మయ్య,సంయుక్త కార్యదర్శిగా శ్రీలత, కార్యవర్గ సభ్యులుగా డాలు స్వామి, కళావతి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు రాష్ట్ర కమిటీ నుంచి ఎలక్షన్ ఆఫీసర్గా కర్నూలు జిల్లాకు చెందిన ఈశ్వర్ నాయుడు వ్యవహరించగా,రాష్ట్ర యోగ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అవినాష్ శెట్టి పరిశీలకులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ ఛైర్మన్ ఆవుల విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా యోగాభివృద్ధికి నిరంతరం కృషిచేసి క్రీడాకారుల సంక్షేమానికి పాటుపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, శ్రీధర్, నరసింహ,దేవేంద్ర,వెంకటేష్, బాబు తదితరులు పాల్గొన్నారు..

# పట్టణ శివారు కాలనీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలి

**జనసేన పార్టీ నాయకులు రాహుల్ సాగర్ డిమాండ్**

ఎమ్మిగనూరు–ఎమ్మిగనూరు నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ రేఖ గౌడ్, ఆదేశాల మేరకు జనం కోసం జనసేన కార్యక్రమంలో భాగంగా జనసేన నాయకులు పట్టణంలోని సోమప్ప నగర్, ఎల్లమ్మ బీడు, కాలనీలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మండల అధికార ప్రతినిధి రాహుల్ సాగర్, రాష్ట్ర చేనేత వికాస్ రాష్ట్ర కార్యదర్శి రవి ప్రకాష్, లు మాట్లాడుతూ పట్టణ శివారు కాలనీల్లో చాలా కుటుంబాలు ఎన్నో సంవత్సరాలుగా నివసిస్తున్నా ఎలాంటి అభివృద్ధికి నోచుకొక పోవడం రాష్ట్ర ప్రభుత్వానికి మరియు మునిసిపల్ అధికారులకు కనపడడం లేదా అని వారు మండిపడ్డారు. ఇంటి పన్ను నీటి పన్ను వసూలు చేస్తూ అధికారులు కనీస సౌకర్యాలు కల్పించకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శివారు కాలనీల్లో ఉన్న సమస్యలపై దిష్టి సారించి పరిష్కారం చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కరణం రవి, షబ్బీర్, రషీద్, బాలు, మోహన్, కాళిదాసు, రాము, తదితరులు పాల్గొన్నారు.

# ఆజాదిక గౌరవ్ యాత్రను జయప్రదం చేయండి



**కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కె.లక్ష్మీనారాయణ రెడ్డి**

ఎమ్మిగనూరు––ఎమ్మిగనూరు ఏఐసీసీ అదేశానుసరం ఏపిసీసీ అధ్యక్షులు శైలజానాథ్ పిలుపు మేరకు ఈనెల 9వ తేదీ నుండి 11వ తేదీ వరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సుధాకర్ బాబు ఆధ్వర్యంలో 75 ఏండ్ల స్వాతంత్ర వేడుకల్లో భాగంగా ఆజాదిక గౌరవ్ యాత్రను నిర్వహించనున్నట్టు ఎమ్మిగనూరు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కె.లక్ష్మీనారాయణ రెడ్డి తెలిపారు. మంగళవారం తన భవనంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపిసీసీ పిలుపు మేరకు 75 ఏండ్ల స్వాతంత్ర వేడుకల్లో భాగంగా ఆగష్టు 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 75 కిలోమీటర్లు ఆజాదిక గౌరవ్ యాత్ర పేరుతో పాదయాత్ర చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ పాదయాత్ర కర్నూలు నుంచి ఎమ్మిగనూరు వరకూ వందలాదిమంది కార్యకర్తలతో భారీగా పాదయాత్ర నిర్వహించనున్నట్టు తెలిపారు. నాటి కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన క్విట్ ఇండియా ఉద్యమ స్పూర్తితో 11వ తేదీన నిర్వహించనున్నపాదయాత్రకు కాంగ్రెస్ నాయకులంతా కదిలి రావాలని ఆయన కోరారు.

# అప్పుడు మాత్రం నాకు కోపం వచ్చేస్తుంది : హీరో నిఖిల్



మొదటి నుంచి కూడా నిఖిల్ డిఫరెంట్ రోల్స్ చేస్తూ వస్తున్నాడు. కథలో కొత్తదనం ఉండేలా .. పాత్రల మధ్య వైవిధ్యం ఉండేలా చూసుకుంటూ వెళుతున్నాడు. 'అర్జున్ సురవరం' హిట్ అయినప్పటికీ ఆయన నుంచి ఇంతవరకూ మరో సినిమా రాలేదు. ఆయన తాజా చిత్రంగా ఈ నెల 13వ తేదీన ప్రేక్షకుల ముందుకు రావడానికి 'కార్తికేయ 2' సిద్ధమవుతోంది. గతంలో వచ్చిన 'కార్తికేయ' సినిమాకి ఇది సీక్వెల్. ఆ సినిమాను మించి ఈ సినిమా ఉంటుందని మేకర్స్ చెప్పడంతో సహజంగానే అంచనాలు పెరిగిపోయాయి. తాజా ఇంటర్వ్యూలో నిఖిల్ మాట్లాడుతూ .. 'అర్జున్ సురవరం' తరువాత పాండమిక్ రావడం వలన నా నుంచి మరో సినిమా రావడం ఆలస్యమైంది. పాండమిక్ తరువాత ఎంతమాత్రం ఆలస్యం చేయకుండా '18 పేజెస్' .. ' కార్తికేయ 2' .. స్పై' సినిమాలను పట్టాలెక్కించాను. వాటిలో ముందుగా 'కార్తికేయ 2' ప్రేక్షకులను పలకరించనుంది. ద్వాపరయుగానికీ .. ద్వారక నగరానికి సంబంధించిన ఒక రహస్యం చుట్టూ అల్లుకున్న కథతో ఈ సినిమా నడుస్తుంది. ఈ సినిమా విడుదల అనేది నన్ను చాలా టెన్షన్ పెట్టేసింది. ఈ సినిమాకి ఓటీటీ ఫ్లాట్ ఫామ్ నుంచి కూడా భారీ ఆఫర్స్ వచ్చాయి. అయినా ఇది థియేటర్స్ లో చూడవలసిన సినిమా అనే ఉద్దేశంతో నిర్మాతలు వెయిట్ చేస్తూ వచ్చారు. ఈ సినిమాలోని విజువల్ ఎఫెక్ట్స్ .. సౌండ్ ఎఫెక్ట్స్ ను థియేటర్స్ లో చూసినప్పుడే మీరు పూర్తిగా ఎంజాయ్ చేయగలుగుతారు. హండ్రెడ్ పర్సెంట్ ఆస్వాదించగలుగుతారు. అందువలన థియేటర్స్ లో విడుదల చేయాలనే పట్టుదలతోనే ఇక్కడివరకూ వచ్చాము. రిలీజ్ డేట్ దగ్గరపడుతుంటే ఎంగ్జైటీ పెరిగిపోతోంది. ఇక నేను స్క్రిప్ట్ విషయంలో ఎక్కువ జోక్యం చేసుకుంటాననే కామెంట్స్ వినిపిస్తున్నాయి. అందులో ఎంతమాత్రం నిజం లేదు. ఒక్కోసారి స్క్రిప్ట్ అంతా వినేసి ఓకే చెప్పేసి సెట్స్ పైకి వెళ్లిన తరువాత కథ మారుస్తూ ఉంటారు. అలా కథ మార్చడం నాకు ఎంతమాత్రం ఇష్టం ఉండదు .. అలా జరిగితే వెంటనే కోపం వచ్చేస్తుంది. ముందుగా చెప్పిన కథను ఎందుకు మార్చారు? అని అడిగితే స్క్రిప్ట్ విషయంలో జోక్యం అని ప్రచారం చేస్తుంటారు. ఇకపై ఒకసారి కథ ఓకే అయ్యాక అందరం సైన్ చేస్తాం .. ఆ తరువాత మా అందరి అనుమతి లేకుండా కథలో మార్పులు చేయకూడదు అనే నిర్ణయానికి వచ్చాను" అంటూ చెప్పుకొచ్చాడు.

# నార్త్ బాయ్ కాట్ అంటే సౌత్ సపోర్ట్ గా చేస్తోంది!



బాలీవుడ్ సూపర్ స్టార్ అమీర్ ఖాన్ నటించిన లేటెస్ట్ మూవీ 'లాల్ సింగ్ చడ్డా'. హాలీవుడ్ లో టామ్ హంక్స్ నటించిన 'ఫారెస్ట్ గంప్' కు రీమేక్ గా ఈ మూవీని రూపొందించారు. అద్వైత్ చందన్ దర్శకత్వంలో మాజీ భార్య కిరణ్ రావుతో కలిసి నిర్మించారు. కరీనా కపూర్ హీరోయిన్ గా నటించిన ఈ మూవీ ద్వారా టాలీవుడ్ యంగ్ హీరో నాగచైతన్య బాలీవుడ్ కు పరిచయం అవుతున్న విషయం తెలిసిందే. తెలుగులో మెగాస్టార్ చిరంజీవి సమర్పణలో రిలీజ్ చేస్తున్నారు. ఆగస్టు 11న రిలీజ్ కాబోతోంది. ఈ నేపథ్యంలో ఈ మూవీ రిలీజ్ కు కౌంట్ డౌన్ మొదలైంది. 'థగ్స్ ఆఫ్ హిందుస్థాన్' ఫ్లాప్ కావడంతో అమీర్ 'లాల్ సింగ్ చడ్డా'పై భారీ అంచనాలు పెట్టుకున్నాడు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ మూవీ ప్రమోషన్స్ కోసం తెలుగు మార్కెట్ పై ప్రత్యేకంగా దృష్టి పెట్టాడు. మెగాస్టార్ చిరంజీవిని సమర్పకుడిగా ఈ ప్రాజెక్ట్ రిలీజ్ కు తెలుగులో అసోసియేట్ చేయడాన్ని బట్టే అమీర్ తెలుగు మార్కెట్ కు ఎంత ప్రాముఖ్యతని ఇస్తున్నాడో స్పష్టమవుతోంది. ఇక ఈ విషయాన్నినాగార్జున ప్రత్యేకంగా అమీర్ చిరు చైలని ఇంటర్వ్యూ చేయడం స్పష్టం చేసింది. ఇదిలా వుంటే ఈ మూవీ నార్త్ లో తీవ్ర వ్యతిరేకతని ఎదుర్కొంటోంది. చాలా దారుణంగా అమీర్ తో పాటు 'అల్ సింగ్ చడ్డా'ని నెటిజన్ లు ట్రోల్ చేస్తున్నారు. బాయ్ కాట్ లాల్ సింగ్ చడ్డా అంటూ నెట్టిట హ్యాష్ ట్యాగ్ లతో ప్రచారం చేస్తున్నారు. కొంత మంది థియేటర్ల వద్దకు వెళ్లి మరీ అమీర్ సినిమాని ఎందుకు బాయ్ కాట్ చేయాలనుకుంటున్నారని ప్రశ్నిస్తూ ఆ వీడియోలని నెట్టింట వైరల్ చేస్తున్నారు. నార్త్ బెల్ట్ లో మరీ ముఖ్యంగా హర్యానా పంజాబ్ ప్రావిన్స్ లోని పలు రూరల్ ఏరియాల్లో 'లాల్ సింగ్ చడ్డా' పై తీవ్ర వ్యతిరేకత వ్యక్త మవుతోంది. సినిమా రిలీజ్ కు టైమ్ దగ్గరపడుతున్నా కొద్దీ నార్త్ లో అమీర్ ఖాన్ సినిమాపై వ్యతిరేకత పెరిగిపోతోంటే సౌత్ లోని ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మాత్రం అంత కంతకు పాజిటివిటీ పెరిగిపోతోంది. సౌత్ రీజియన్ లోనూ అమీర్ సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి సపోర్ట్ లభిస్తుండటం విశేషం. బీజేపీకి చెందిన కొంత మంది విజయశాంతి లాంటి లీడర్లు తప్ప ఈ మూవీని సౌత్ లో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వ్యతిరేకించే వారు కనిపించకపోవడం గమనార్హం. 2015లో ఓ సందర్భంగాలో అమీర్ అన్న మాటలు ఇప్పుడు 'లాల్ సింగ్ చడ్డా'కు నార్త్ లో తీవ్ర ఇబ్బందుల్ని క్రియేట్ చేస్తున్నాయి. దేశ వ్యాప్తంగా అసహనం పెరిగిపోయిందని తన వైఫ్ దేశం విడిచి వెళ్లిపోదామని అంటోందని అమీర్ గతంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే.

# ఎక్కడున్నా సరే సారా పంచ్ పడాల్సిందే!



సెలబ్రిటీలు ఫిట్ నెస్ విషయంలో ఎంతో కేర్ తీసుకుంటారు. కఠోర సాధనతో అందం ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ఎంతో శ్రమిస్తారు. శిల్పా శెట్టి.. ఐశ్వర్యారాయ్.. కరీనా కపూర్ లాంటి స్టార్లు నవతరం భామల్లో మరింత స్పూర్తి నింపుతున్నారు. వయసుతో సంబంధం లేకుండా కఠోర వ్యాయామం చేయడం నిరంతరం హాట్ టాపిక్. వీళ్ల బాటలోనే బాలీవుడ్ యంగ్ బ్యూటీ సారా అలీఖాన్ కూడా కఠోరంగా శ్రమిస్తోంది. శరీరాన్ని విల్లులా బెండు చేయగల గొప్ప పిట్ నెస్ ఫ్రీక్. జిమ్లో సింపుల్ ఎక్సర్ సైజ్ లతో పాటు..కఠోరమైన బాక్సింగ్ పంచ్ లు సైతం విసురుతుంది. రింగ్ లో కి బాక్సర్ లా తయారై పంచ్ షాట్ లు చేతులతో..కాళ్లతో ప్రాక్టీస్ చేస్తోంది. హిప్ ని బంతిలా రౌండుగా తిప్పడం సారా ప్రత్యేకత. ఇక యోగా క్లాస్ లకి సైతం క్రమం తప్పకుండా హాజరవుతుంది. ఇండియాలో ఉంటే ఇవన్నీ సారా జీవితంలో నిత్యకృత్యాలు. మరి దేశం విడిచి వెళ్లినా సారా ఇవే జాగ్రత్తలు..ఇదే టైమ్ టైబుల్ ని ఫాలో అవుతుందా? అంటే అవుననే తెలుస్తోంది. ప్రస్తుతం సారా అలీఖాన్ ముంబైలో ఉంది. వ్యక్తిగత పనిమీద అమెరికాకి వెళ్లాల్సి వస్తే వెళ్లింది. అక్కడ ఉన్నా సరే ముంబై లైఫ్ ని మిస్ కాదని తెలుస్తోంది. ఫిట్ నెస్ విషయంలో ముంబై..అమెరికా అయినా ఒకటే టైమ్ టేబుల్ అంటూ దూసుకుపోతుంది. తాజాగా అమెరికా నుంచి రెండు ఫోటోల్ని ఇన్ స్టాలోకి వదిలింది. బాక్సర్ లా రెడీ అయి చేతికి గ్లౌస్ వేసుకుని పంచ్ లు విసరడం ప్రాక్టీస్ చేస్తుంది. లేత నీలం రంగు స్పోర్ట్స్ బ్రాలెట్తో పాటు షార్టు – స్నీకర్స్తో ఆడుతూ కనిపించింది. మరో ఫోటోలో.. సారా ట్రెడ్మిల్స్ ముందు నిలబడి బరువులు ఎత్తడం చూడొచ్చు. ఇలా దేశం దాటినా సారా డైలీ లైఫ్ కేరింగ్ మాత్రం తప్పని సరి అని తెలుస్తుంది. సారా అలీఖాన్ సినిమాల విషయానికి వస్తే ప్రస్తుతం రెండు ప్రాజెక్ట్ లు చేతిలో ఉన్నాయి. ఇటీవలే లక్ష్మణ్ ఉట్టేకర్ సినిమా షూటింగ్ పూర్తిచేసింది. 'గ్యాస్ లైట్' అనే మరో చిత్రంలో నటిస్తుంది. ప్రస్తుతం ఈ సినిమా ఆన్ సెట్స్ లో ఉంది. ఇంకా పలు ప్రాజెక్ట్ లు చర్చల దశలో ఉన్నాయి. బ్యూటీ త్వరలో టాలీవుడ్ లోనూ తెరంగేట్రం చేసే ఛాన్స్ ఉంది.

# పాక్‌తో మ్యాచ్.. డీకే, అశ్విన్ వద్దు! అతడు ఉంటేనే బెటర్!



క్రికెట్ ప్రేమికులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న మెగా టోర్నీ ఆసియా కప్–2022 ఆగష్టు 27న ఆరంభం కానుంది. దుబాయ్ వేదికగా గ్రూప్– బిలోని శ్రీలంక, అఫ్గనిస్తాన్ జట్ల మధ్య మ్యాచ్‌తో మెగా ఈవెంట్‌కు తెరలేవనుంది. ఇక ఆ మరుసటి రోజే.. క్రికెట్ ప్రపంచం వేయి కళ్లతో ఎదురుచూస్తున్న ఇండియా– పాకిస్తాన్ మ్యాచ్ జరుగనుంది. ఈ క్రమంలో టోర్నీ టీ20 వరల్డ్‌కప్–2021లో గతేడాది దాయాది జట్టు చేతిలో ఎదురైన పరాభవానికి ప్రతీకారం తీర్చుకునేందుకు రోహిత్ శర్మ సేన సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఆసియా కప్–2022కు బీసీసీఐ భారత జట్టును ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో టీమిండియా మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా పాకిస్తాన్‌తో ఆరంభ మ్యాచ్‌కు తుది జట్టును అంచనా వేశాడు. ఈ రసవత్తర మ్యాచ్ ఆడే జట్టులో అతడు వెటరన్ వికెట్ కీపర్ బ్యాటర్ దినేశ్ కార్తిక్‌కు చోటివ్వలేదు. ఈ మేరకు యూట్యూబ్ చానెల్ వేదికగా మాట్లాడుతూ తన జట్టు ఎంపిక గురించి వివరాలు వెల్లడించాడు. "టాపార్డర్‌లో రోహిత్ శర్మ.. కేఎల్ రాహుల్.. విరాట్ కోహ్లి.. రిషభ్ పంత్, సూర్యకుమార్ యాదవ్ మిడిలార్డర్‌లో ఆడాలి. ఆరోస్థానంలో హార్దిక్ పాండ్యా ఉండనే ఉన్నాడు. ఇక లోయర్ ఆర్డర్‌లో దినేశ్ కార్తిక్‌కు చోటు దక్కకపోవచ్చు. ఎందుకంటే.. దీపక్ హుడా రూపంలో బ్యాట్‌తో.. బాల్‌తో రాణించగల ఆటగాడు ఉన్నాడు" అని ఆకాశ్ చోప్రా పేర్కొన్నాడు. ఇక కేఎల్ రాహుల్, విరాట్ కోహ్లి చాలా రోజుల తర్వాత జట్టులోకి వచ్చిన నేపథ్యంలో.. "పాకిస్తాన్‌తోనే టోర్నీలో తొలి మ్యాచ్.. కేఎల్ రాహుల్ చాలా రోజులుగా ఆటకు దూరంగా ఉన్నాడు. విరాట్ కోహ్లి సైతం బ్రేక్ తర్వాత ఎంట్రీ ఇస్తున్నాడు. ఈ పరిణామాల క్రమంలో బ్యాటింగ్ ఆర్డర్ ఒకవేళ కుప్పకూలితే.. దీపక్ హుడా రూపంలో చక్కని ప్రత్యామ్నాయం ఉంటుంది" అని ఆకాశ్ చోప్రా చెప్పుకొచ్చాడు. అదే విధంగా బౌలింగ్ విభాగంలో స్టార్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్‌కు కూడా ఆకాశ్ చోప్రా చోటివ్వలేదు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**